www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 బుధవారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 24, ఏప్రిల్ 2024

సంపుటి: 5 సంచిక: 335, పేజీలు: 12, వెల: రూ.5/-



## భువనగిరి పార్లమెంట్ స్థానానికి బిజెపి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన బూర నర్సయ్య గౌడ్

**యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు ఏప్రిల్ 23:**
నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయ శంకర్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, బిజెపి అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నగరంలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

- గౌలిగూడ నుంచి బందోబస్తు మధ్య ప్రారంభం
- భారీగా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- గౌలిగూడ రామాలయం పూజల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్23(వెలుతురు):**
హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతీ ఏటా నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్ర సందడిగా ప్రారంభమైంది. గౌలిగూడలోని రామమందిరం నుంచి హనుమాన్ శోభాయాత్ర మొదలైంది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి ఆలయం వరకు ఈ యాత్ర కొనసాగనుంది. గౌలిగూడ రామ్ మందిర్ నుంచి కాచిగూడ, నారాయణ గూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, బన్సీలాల్ పేట్ మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు శోభయాత్ర సాగనుంది. దాదాపు 13 కిలో మీటర్ల మేర శోభాయాత్ర కొనసాగునుంది.

మిగతా..2లో



## కూలిన వంతెన

- మానేరు వాగుపై వంతెన నిర్మాణంలో లోపాలు
- అర్ధరాత్రి కూలడంతో తప్పిన ముప్పు

**పెద్దపల్లి,ఏప్రిల్ 23(వెలుతురు):**
పెద్దపల్లి జిల్లాలో మానేరు వాగుపై నిర్మాణంలోని వంతెన కూలిపోయింది. ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జ్ సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. అయితే, ఈదురు గాలుల బీభత్సానికే వంతెన కుప్పకూలినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి బ్రిడ్జ్ పిల్లర్లు కుంగి పోయాయి. దీనికి తోడు రాత్రి ఈదురు గాలుల ప్రభావంతో బ్రిడ్జిపై ఉన్న గైడర్లు కింద పడిపోయాయి. నాసిరకమైన పనులు జరుగుతుండటంతోనే బ్రిడ్జ్ కూలి పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ఓడేడు నుంచి జయశంకర్

మిగతా..2లో



### మరోసారి మోసపోయి

## ఓట్లేస్తారా?

- పిరికిపందలు రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి
- ఓటు అనే ఆయుధంతో వారికి బుద్ధిచెప్పాలి
- మతంతో ఓట్లడిగే బీజేపీని తరిమికొట్టండి
- చేవెళ్లలో బాహుబలి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**చేవెళ్ల, (వెలుతురు):**
హామీలు, గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ఓసారి మోసగించారు...ఇప్పుడు మరోసారి మోసం పార్ట్ 2 సినిమా చూపిస్తున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని రాజేంద్రనగర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా

మిగతా..2లో

## లంగా...లఫంగి మాటలు చెప్పను.. కేసీఆర్, హరీష్

- బీఆర్ఎస్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉండండి
- జోగులాంబ సాక్షిగా మాట ఇస్తున్నా..రుణమాఫీ చేసి తీరుతా
- రైతుల రుణం తీర్చుకోకుంటే నా జీవితమే దండగ
- ఎన్ని కోట్లయినా పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తా

### నాగర్‌కర్నూలు సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్, (వెలుతురు):**
నాగర్‌కర్నూల్ బిజినేపల్లి బహిరంగసభలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఆగస్టు 15 లోపు జోగులాంబ సాక్షిగా మాట ఇస్తున్నా... రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతామని తెలిపారు. సవాల్ విసిరిన హరీశ్‌రావు, ఆయన మామ బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా..? సిద్ధంగా ఉండండి. రైతుల రుణం తీర్చుకోకపోతే నా జీవితమే దండగ...మీ లాగా లంగా లఫంగి మాటలు నేను చెప్పను..వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని కేసీఆర్ చెప్పాడు. రాబోయే పంటకు 500 బోనస్ ఇచ్చి ప్రతి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొంటుంది..ఐదు గ్యారెంటీలు, రుణమాఫీపైన కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాలి. తెలంగాణ వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్‌కు కేసీఆర్ పాలనలో తీరని అన్యాయం జరిగింది. కరీంనగర్‌లో ఓడిపోతానని పారిపోయి పాలమూరుకు వస్తే కేసీఆర్‌ను ఇక్కడి ప్రజలు భుజాల మీద మోసి పార్లమెంటుకు పంపించారు.. తెలంగాణను కాంగ్రెస్ ఇస్తే నేనే సాధించానని కేసీఆర్ చెప్పుకున్నాడు.. కృష్ణా నదికి వరదలు వచ్చి అలంపూర్ మునిగిపోతే కేసీఆర్ తన ఇళ్లు అమ్మి పరిహారం ఇస్తానన్నారు.. కానీ అధికారంలోకి వచ్చాక మరిచిపోయాడు. రంగారెడ్డి పాలమూరు ఎత్తిపోతల ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. కుర్చీ వేసుకుని తుమ్మిల కట్టిస్తానన్న కేసీఆర్ ఆ తర్వాత పట్టించుకోలేదు..కొంతమంది జిల్లా నాయకులు దొంగలకు సద్దులు మోస్తున్నారు.. రేవంత్ రెడ్డి మమ్మల్ని తిడుతున్నారని అరుణమ్మ అంటోంది.. అరుణమ్మకు, నాకు నీకు ఉన్న పోటీ ఏందీ... పంచాయతీ ఏందీ.. గట్టు తగాదా ఉందా? అని ప్రశ్నించారు. 70 ఏళ్ల తర్వాత పాలమూరుకు అవకాశం వస్తే జెండాలు పక్కన పెట్టి అభివృద్ధి కోసం పనిచేయకుండా కాళ్లలో కట్టె పెట్టి పడేయాలని ప్రయత్నం చేస్తున్నారు..గద్వాలలో బీజేపీ అభ్యర్థికి ఏడు వేల ఓట్లు వచ్చి డిపాజిట్ పోయింది.. ఇక అరుణమ్మను ఏం అడుగుతం..అని వ్యాఖ్యానించారు.

### దొరల గడీకి కాపలా ప్రవీణ్

గడీలను కూలుస్తానని ఆనాడు మాట్లాడిరది ప్రవీణ్‌కుమారే..ఆరు నెలల్లో ఏం మారిందని కేసీఆర్ దగ్గరకు పోయాడు..కాంగ్రెస్‌లోకి వచ్చి కేసీఆర్‌పైన పోరాటం చేసే అవకాశం ఉన్నా కేసీఆర్‌ను భుజాన పెట్టుకొని తిరుగుతున్నాడు..మాదిగల వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం పెడితే అసెంబ్లీ నుంచి కేసీఆర్ మమ్మల్ని ఈడ్చి పడేశారు..ఎస్సీ వర్గీకరణకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యతిరేకమా? అనుకూలమా? అని ప్రశ్నించారు. మాదిగలకు పదేళ్ల పాటు కేసీఆర్ ద్రోహం చేశాడు..అలాంటి వ్యక్తి పక్కన



ఆర్ఎస్ ప్రవీణ్ ఎలా కూర్చుంటాడు..ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పదవిలో ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను డీజీపీని చేసేది..తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ పదవి ఇస్తామని ఆఫర్ చేస్తే ఆయన తీసుకోలేదు..దొరల గడీల దగ్గర కాపాలాగా ఆర్ఎస్ నిలబడ్డాడు..అని వ్యాఖ్యానించారు.

### ఎన్ని కోట్లయినా పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తా

సమైక్య పాలనలో పాలమూరు ప్రాజెక్టులు ముందుకు సాగలేదు. నేను వచ్చాక పది కోట్లు మంజూరు చేశాను..పాలమూరు రంగారెడ్డికి రెండు టీఎంసీలతో పూర్తి చేసే బాధ్యత నాది.. తుమ్మిల ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి అలంపూర్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాం..ఎన్ని వేల కోట్లయినా ప్రాజెక్టులు పూర్తి చేసి పాలమూరు ప్రజల గుండెల్లో నిలిచిపోతా..వాల్మీకి బోయల ఆవేదన, బాధ నాకు తెలుసు..వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నం చేస్తాం.

మహబూబ్ నగర్‌లో వంశీచంద్ రెడ్డి, నాగర్ కర్నూల్‌లో మల్లురవిని గెలిపిస్తారన్న విశ్వాసం ఉందని తెలిపారు.

## ఖచ్చితంగా ఓటు వేయండి

- ఏ పార్టీకి ఓటు వేయాలో మీ ఇష్టం
- ప్రజాస్వామ్య బలోపేతానికి పార్టీలు కృషి చేయాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచన



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23(వెలుతురు):**
ఏ పార్టీకి ఓటు వేయాలనుకుంటే ఆ పార్టీకి ఓటు వేయండి...కానీ ప్రజలంతా ఓటింగ్‌లో తప్పకుండా పాల్గొనండి అంటూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కోరారు. ఓటు అన్నది మన హక్కు అని, అది ప్రజాస్వామ్యాన్ని నిలుపుతుందని అన్నారు.

మిగతా..2లో

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

- 30న విడుదల కానున్న టెన్త్ ఫలితాలు
- తెలంగాణ విద్యాశాఖ వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్ 23(వెలుతురు):**
తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాలను ఈ నెల 30న మంగళవారం విడుదల చేయనున్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేస్తారు. ఈ మేరకు ఎస్ఎస్ సీ బోర్డు అధికారికంగా ప్రకటించింది. తెలంగాణలో పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకూ జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు హాజర య్యారు. ఇందులో 2,57,952 మంది బాలురు కాగా.. 2,50,433 మంది బాలికలు. ఏప్రిల్ 3 నుంచి జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ పక్రియ మొదలైంది. ఏప్రిల్ 20తో మూల్యాంకనం

మిగతా..2లో

## కేజ్రీవాల్, కవితలకు మరో 14 రోజుల రిమాండ్

- కవిత కేసుపై నేడు మరోమారు విచారణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్23(వెలుతురు):**
దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఈ కేసులో ఇద్దరికీ మరో 14 రోజుల పాటు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మే 7న ఈ నేతలిద్దరినీ కోర్టు ఎదుట హాజరు పరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. 2021-22 నాటి దిల్లీ మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ గత నెలలో ఈడీ అధికారులు కవిత, కేజ్రీవాల్‌ను వేర్వేరు తేదీల్లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత వీరిద్దరూ తిహాడ్ జైలులోనే ఉంటున్నారు. మరోవైపు, ఇటీవల సీబీఐ కవితను తన కస్టడీకి తీసుకొని విచారించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. కవిత బెయిల్ పిటిషన్‌పైనా దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టింది. ఈడీ తరఫున జోయబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కవితకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. కవిత అరెస్టు చట్టబద్ధంగానే జరిగిందని, సెక్షన్ 19కి అనుగుణంగా జరిగినట్లు ఈడీ తరఫు న్యాయవాది వివరించారు. కవితను అరెస్టు చేయవద్దని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వలేదు. 2023 సెప్టెంబర్ 26న ఈడీ తదుపరి 10 రోజులు సమన్లు ఇవ్వబోమని అండర్ టేకింగ్ ఇచ్చింది. మార్చి 15న సాయంత్రం 5.20 గంటలకు ఆమెను అరెస్టు చేశాం. తనపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను మార్చి 19న ఆమె ఉపసంహరించుకున్నారు. కవితకు వ్యతిరేకంగా శరత్‌చంద్రారెడ్డి, బుచ్చిబాబు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవ వాంగ్మూలాలు ఇచ్చారు. కవితను సూర్యాస్తమయం లోపే అదుపులోకి తీసుకున్నాం. కవిత అరెస్టు సాయంత్రం 5.20గంటలకు జరిగింది.కవిత అరెస్టు రోజు హైదరాబాద్‌లో సూర్యాస్తమయం సాయంత్రం 6.26గంటలకు అయ్యింది.

మిగతా..2లో



GeneralNEWS

# కేజ్రీవాల్, కవితలకు మరో 14 రోజుల రిమాండ్

మొదటిపేజీ తరువాయి..
ఇండోస్పిరిట్స్ కంపెనీలో కవిత బినామీగా అరుణ్ పిళ్లై ఉన్నారు. అరెస్టుకు గల కారణాలు చెప్పి కవిత సంతకం తీసుకున్నాం. అరెస్టు చేసిన 24గంటల్లో కోర్టులో హాజరుపరిచాం. సౌత్‌గ్రూప్‌లోని ఇతర వ్యక్తులకు ప్రేమ్ మండూరి బినామీగా ఉన్నారు' అని ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణను కోర్టు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. ఈడీ వాదనలు పూర్తయిన తర్వాత కవిత తరఫు న్యాయవాదులు కౌంటర్ వాదనలు వినిపించనున్నారు. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత .. ఇప్పట్లో జైలునుంచి బయటికి వచ్చే పరిస్థితులు మాత్రం అస్సలు కనిపించట్లేదు. జైలు నుంచి బయటికి రావడానికి బెయిల్ కోసం కవిత చేస్తున్న విశ్వప్రయత్నాలన్నీ విఫలం అవుతున్నాయ్.! ఎందుకంటే.. ఈ కేసులో కవిత పాత్ర కీలకంగా ఉందని.. ఈడీ, సీబీఐ బలమైన ఆధారాలు చూపిస్తుండటంతో కోర్టుల్లో వరుస షాక్‌లు తగులుతున్నాయి. మంగళవారం నాటితో సీబీఐ, ఈడీ కస్టడీ ముగియడంతో.. ప్రత్యేక కోర్టు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచి.. మరో 14 రోజులు కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు సంస్థలు కోరగా కోర్టు అనుమతిచ్చింది. మే-7 తారీఖు వరకు కవిత కస్టడీలోనే ఉండనున్నారు. కోర్టు ఆదేశాల మేరకు కవితను మళ్లీ తీహార్ జైలుకు సీబీఐ అధికారులు తరలించారు. కాగా.. ఈసారి కవిత విషయంలో ఎలాంటి కొత్త విషయాలను ఈడీ, సీబీఐ అధికారులు జతచేయలేదు. మరోవైపు.. కవిత కస్టడీ అవసరం లేదంటూ ఆమె తరపు లాయర్ వాదించినప్పటికీ.. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని, కేసు విచారణ పురోగతిపై ప్రభావం ఉంటుందని కాబట్టి మళ్లీ కస్టడీకి ఇవ్వాలని ఈడీ న్యాయవాది కోరారు. ఈ వాదనల అనంతరం కేసు దర్యాప్తు పురోగతిని ఈడీ అధికారులు కోర్టుకు అందజేశారు. 60 రోజుల్లో కవిత అరెస్ట్‌పై త్వరలోనే చార్జిషీట్ సమర్పిస్తామని కోర్టుకు ఈడీ తెలిపింది. సాక్ష్యాలను తారుమారు చేస్తారని అరెస్ట్ చేసిన రోజునుంచి ఆరోపిస్తున్నారన్న విషయాన్ని మరోసారి కవిత లాయర్ కోర్టుకు వివరించారు. ఈడీ, సీబీఐ అధికారులు చెప్పినవే చెబుతూ చెబుతున్నారని.. కొత్త చెప్పిందేమీ లేదని కవిత లాయర్ న్యాయ మూర్తికి చెప్పారు. ఇలా ఇరువురి వాదనలు విన్న తర్వాత కవితను కస్టడీ ఇవ్వడం జరిగింది. కవిత తరపున న్యాయవాది నితేష్ రానా వాదనలు వినిపించగా... ఈడీ తరపున లాయర్ జోయబ్ హుస్సేన్ వినిపించారు. ఈడీ వాదనల అనంతరం ఈ కేసుపై విచారణను కోర్టు బుధవారం వాయిదా వేసింది. రేపు కూడా వాదనలు కొనసాగనున్నాయి. ఈడీ వాదనల అనంతరం కవిత తరపు న్యాయవాదులు కౌంటర్ వాదనలు వినిపించనున్నారు. కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్నారంటేనే అర్థం అవుతుంది.. అరెస్ట్ చట్ట విరుద్ధంగా జరిగిందని. కవితకు వ్యతిరేకంగా శరత్, మాగుంట, శ్రీనివాసులు రెడ్డి రాఘవ,బుచ్చిబాబు వాంగ్మూలాలు ఇచ్చారు. మాగుంట శ్రీనివాస్ రెడ్డి, శరత్ చంద్ర రెడ్డి ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కవితను అరెస్ట్ చేశాము. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరుణ్ పిళ్ళై కవిత బినామీగా వ్యవహరించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు బెయిల్ ఇవ్వొద్దు. అరెస్ట్‌కు గల కారణాలపై కవిత సంతకం తీసుకున్నాం. గంటల్లో కవితను కోర్టు ముందు హాజరుపరిచాం. కవితను అరెస్ట్ చేయమని ఎలాంటి అండర్ టేకింగ్ ఇవ్వలేదు. కవిత అరెస్ట్ సందర్భంగా ట్రాన్సిట్ ఆర్డర్ అవసరం లేదు. ఈడీ జాతీయ దర్యాప్తు సంస్థ దీనికి దేశమంతా పరిధి ఉంది. పీఎంఎల్ఏ చట్టం కనుక అరెస్ట్‌కు ట్రాన్సిట్ రిమాండ్ అవసరం లేదు. ఇండో స్పిరిట్స్ కంపెనీలో కవిత బినామిగా అరుణ్ పిళ్ళై ఉన్నారు. ఇండో స్పిరిట్స్‌లో కవితకు 32 శాతం వాటా ఉంది. సౌత్ గ్రూప్‌లోని ఇతర వ్యక్తులకు ప్రేమ్ మండూరి బినామిగా ఉన్నారు. దినేష్ అరోరా విచారణ సందర్భంగా అనేక అంశాలను వెల్లడించారు. బుచ్చిబాబు ఫోన్‌లో ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన కీలక సమాచారం లభించింది' అంటూ ఈడీ తరపు లాయర్ జోయబ్ హుస్సేన్ కోర్టుకు తెలిపారు.

# మరోసారి మోసపోయి ఓట్లేస్తారా?

మొదటిపేజీ తరువాయి..
భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలో పాల్గొన్నారు. మోదీకి, ఎన్డీఏ కూటమికి 400 కాదు..200 సీట్లు కూడా వచ్చేలా లేవు. కాంగ్రెస్ పార్టీ కూడా 100 నుంచి 150 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేదెవరైనా మన వద్దకు రావాలంటే బీఆర్ఎస్‌కు మంచి సీట్లు రావాలి...8 నుంచి 10 సీట్లు ఇస్తే మనం చెప్పినట్లే కేంద్రంలో ఉన్న ప్రభుత్వం వింటది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పారిపోయే పిరికిపందలు, తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

## బాహుబలి కాసాని జ్ఞానేశ్వర్

బలహీన వర్గాలకు సీట్లు ఇస్తే గెలవరన్న అపవాదు ఉంది. అది తప్పని నిరూపించాలి. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొదటిసారిగా బీసీ అభ్యర్థి బరిలో ఉన్నారు. అందరం కలిసి బాహుబలి కాసాని అన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ పార్టీని నిలదీయాలి. రైతుల దగ్గరకు వెళ్లి రూ.2 లక్షల హామీ నెరవేరిందా అని ప్రశ్నించారు. మీరంతా బాహుబలి సినిమా చూశారా? అందులో రెండు పార్టులు ఉన్నట్లే...రేవంత్ రెడ్డి మోసం పార్ట్-1 అయిపోతుంది...మోసం పార్ట్-2 సీక్వెల్ పెట్టుకున్నాడు. ఒకసారి మోసపోయింది చాలదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ అభివృద్ధి చేసిన పదేళ్ల పాలన ఒకవైపు...100 రోజుల అబద్ధాల పాలన ఒక వైపు ఉంది ఆలోచించి ఓటే వేయాలని అభ్యర్థించారు. రైతుబంధు, కళ్యాణ లక్ష్మి, రైతుబీమా, కేసీఆర్ కిట్ ఇలా చెప్పుకుం టూ పోతే కేసీఆర్ ఎన్నో మంచిపనులు చేశారు. చేవెళ్లలో బ్రహ్మాండమైన అభివృద్ధి చేసుకు న్నాం. వికారా బాద్‌ను జిల్లా చేసుకున్నాం.


111 జీవోను కూడా ఎత్తివేసింది కేసీఆర్ మాత్రమే అన్నది గుర్తు చేసుకోవాలని సూచించారు.

## మతం పేరుతో ఓట్లడిగే బీజేపీకి బుద్ధిచెప్పాలి

బీజేపీ పదేళ్లలో ఏమీ చేశారో చెప్పి ఓటు అడగుమంటే చెప్పేందుకు ఒక్కటీ లేదు. మోదీ తెలంగాణకు ఒక్క కాలేజ్ పెట్టినవా, స్కూల్ ఇచ్చినవా, జాతీయ ప్రాజెక్ట్ ఇచ్చినవా? ఏమీ ఇచ్చినవ్ అని ప్రశ్నించారు. రాముడితోని మనకు పంచాయితీ లేదు. రాముడు అందరివాడు.
మతం పేరుతో విద్వేషాలు నింపి ఎంపీ సీట్లు గెలవాలని భావిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డలు ఆలోచించాలి. మోదీ సిలిండర్ ధరను ఎంత పెంచిండో గుర్తు చేసుకోవాలి. క్రూడ్ ఆయిల్ ధర తగ్గినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిండు. ఎందుకు ఓట్లు వేయాలి... రూ.70 పెట్రోల్‌ను రూ.110 చేసినందుకా? డీజిల్ రేట్లు పెంచినందుకా? సిలిండర్ రేట్లు పెంచినందుకా? పప్పు, ఉప్పుల ధరలు పెంచినందుకా? అని ప్రశ్నించారు. బండి సంజయ్ మాత్రం మోదీ దేవుడు అంటాడు. ఆయన దేనికి దేవుడో చెప్పుమంటే చెప్పడు. రాజకీయాల కోసం మతాన్ని వాడుకునే బీజేపీకి కచ్చితంగా మన బుద్ధి చెప్పాలి. ఈ ప్రాంతా నికి బీజేపీ ఏం చేసిందని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఓటు అడుగుతాడు. కృష్ణా నీళ్లలో వాటా తేల్చుమంటే పదేళ్లుగా దాన్ని తేల్చలేదు. పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వ మంటే ఇవ్వ లేదు. బీజేపీని అడ్డుకునేది ఎవరైనా ఉన్నారంటే అది కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. ఈటెల, రఘునందన్‌రావు, అరవింద్, సోయం బాపురావును ఓడిరచిందెవరు? కిషన్‌రెడ్డిని పోటీ చేసేందుకే భయపడేలా చేసిందే బీఆర్ఎస్ అన్న విషయం గుర్తుంచుకోవాలి. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన వెంటనే చేవెళ్లలో కాంగ్రెస్ పని అయిపోయిందని తెలిపారు.

# తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టినోళ్లు నీతులు చెప్పడమా?

**జూన్ 4న బీఆర్ఎస్ దుకాణం బంద్**

**అందుకే కేసీఆర్ వ్యవస్థాపక దినోత్సవానికి దూరమైండు**

**6 గ్యారంటీలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు చేస్తారా?**

**ప్రజలారా... ఆలోచించండి**

**బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్**

కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 23:
10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కమీషన్లకు కక్కుర్తి పడి క్రిష్ణా జలాల్లో తెలంగాణ వాటాను అక్రమంగా ఏపీకి దోచిపెట్టిన నేతలు కూడా నీటి జలాల పంపిణీపై మాట్లాడటమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది. జనం నవ్వుకుంటారనే సోయి కూడా లేకుండా అపర మేధావి మాట్లాడుతున్నడు. గోదావరి, క్రిష్ణా జలాలు, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత కూడా బీఆర్ఎస్ నేతలకు లేదు. మనకు రావాల్సిన నీళ్లను ఏపీకి దోచిపెట్టారు. కమీషన్లకు కక్కుర్తి పడి కట్టిన ప్రాజెక్టులన్నీ కూలిపోతున్నయి. మొన్న కాళేశ్వరం.. ఇయాళ పెద్దపల్లి ఓడేడు బ్రిడ్జీ ఇందుకు నిదర్శనం.. బీఆర్ఎస్ పార్టీ చేసిన అరాచకాలు, మోసాల పట్ల ప్రజలు విసిగిపోయారు. ఆ పార్టీ నేతలు ఎన్ని మొసలి కన్నీరు కార్చినా, పొర్లు దండాలు పెట్టినా, బస్ యాత్ర కాదు కదా.... మోకాళ్ల యాత్ర చేసినా జనం నమ్మే పరిస్థితి లేదు. జనమే సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా బీఆర్ఎస్ ను నమ్మడం లేదు. ఈ విషయం కేసీఆర్ కు



తెలుసుకాబట్టే ఈనెల 27న బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రచార సభలకే కార్యకర్తలు రావడం లేదు... ఇగ ఆ కార్యక్రమానికి ఎవరు రారని తెలిసే వ్యవస్థాపక దినోత్సవానికి దూరంగా ఉంటున్నారు. జూన్ 4న బీఆర్ఎస్ దుకాణం బంద్ కావడం తథ్యం.
కాంగ్రెస్ నేతలు టీవీల్లో బ్రేకింగ్ ల కోసం బీజేపీపైన, నాపైన ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారు. మంత్రి పదవిలో ఉన్నామనే సోయి లేకుండా వ్యక్తిగత దూషణలు చేస్తున్నారు. వినాశకాలే విపరీత బుద్ధి. నేను ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని, ప్రభుత్వ విధానాలపైన ప్రశ్నిస్తుంటే.. వ్యక్తిగత దూషణలు, బూతులు తిట్టడం ఎంత వరకు న్యాయమో విజులైన ప్రజలు ఆలోచించాలి. ఇలాంటి చిల్లర మల్లర ఆరోపణలకు స్పందించాల్సిన అవసరం లేదు. ఉన్నత పదవుల్లో ఉన్న వాళ్లు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. సంయమనం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతే ప్రజలు సమయం చూసి కర్రు కాల్చి వాతపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకుని హుందాగా వ్యవహరించాల్సిన అవసరం రాజకీయ పార్టీల నేతలందరిపైనా ఉంది.

# బహుజనుల చూపు కాంగ్రెస్ వైపే..

**- అనంత చంద్రశేఖర్ గౌడ్**

చండూర్ వెలుతురు ఏప్రిల్ 23:
మన రాష్ట్రం ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు సన్నిహితుడైన చామల కిరణ్ కుమార్ రెడ్డి భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా తెలంగాణ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో కనివిని ఎరగని రీతిలో మన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో విజయం వైపు దూసుకెళ్తున్న సందర్భంగా ప్రతిపక్షాలు ఉన్నాయా లేవా అనే విధంగా పోటీ అనేది కాంగ్రెస్లోని ఆయా నియోజకవర్గాలకే ఏర్పడినట్టుగా కనిపిస్తుంది అని అనంత చంద్ర శేఖర్ గౌడ్ చండూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ అన్నారు, ఈసందర్భంగా చూస్తుంటే చామల కిరణ్ కుమార్ రెడ్డి నాలుగు లక్షల పై చిలుకు మెజార్టీతో గెలవడం ఖాయంగా కనిపిస్తుంది. బిఆర్ఎస్ వీఆర్ఎస్ తీసుకున్న పరిస్థితి , కొంతమందితో బిజెపి వాపును చూసి బలుపు అనే పరిస్థితిలో కనిపిస్తుంది ప్రస్తుతం బిజెపి అభ్యర్థి అయిన బూర నర్సయ్య గౌడ్ గౌడ సామాజిక వర్గాన్ని నా వైపే ఉంది అన్నట్టుగా మాట్లాడుతూ గెలుపు ఖాయం ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్న ఈ సందర్భంలో వారికి సూచించే విషయం ఏమిటంటే గౌడ సామాజిక వర్గాన్ని ఓట్లు అడిగే నైతిక అర్హత నరసయ్య గౌడ్ కు లేదంటూ డిమాండ్ చేస్తున్నాం, ఎందుకనగా 2018 లోని సార్వత్రిక ఎన్నికల్లో టిఆర్ఎస్ లో ఉంటూ గొంగిడి సునీత అనే అభ్యర్థికి గౌడ ఆశీర్వాద సభ నిర్వహిస్తూ ఒక గౌడ్ ని ఓడించిన పరిస్థితి ఎవరు మర్చిపోలేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నా%శీ% అదేవిధంగా రాజగోపాల్ రెడ్డి గారు పార్టీ మారడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి అభివృద్ధికి నిధులు ఇవ్వకపోవడం కుటుంబ పాలన రాజకీయాలని భ్రష్టు పట్టిస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ పార్టీ మారడం జరిగింది కానీ బూర నరసయ్య గౌడ్ అనే వ్యక్తి అసలు పార్టీ ఎందుకు మారారు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంటుంది, ఒక కులం ముసుకులో రాజకీయాలు చేసిన వ్యక్తి ఎప్పుడు రాజకీయాల్లో రాణించలేరు ఒక డాక్టర్ గా బూర నర్సయ్య గౌడ్ ను అభిమానిస్తాం కానీ రాజకీయాల కోసం ఒక వర్గాన్ని



వాడుకోవాలని దానికి మేము వ్యతిరేకిస్తున్నాం అదేవిధంగా రాజకీయాల్లో సమాజం సేవ చేయడానికి కావాల్సింది కులం మతం కాదు మన రక్తంలో సేవ చేసే గుణం ఉండాలి కాబట్టి ఆలోచించి మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది మన భువనగిరి ఇంచార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో భువనగిరి అభ్యర్థిని గెలిపించుకొని అభివృద్ధి కోసం బాటలు వేసుకుందాం

# ఖచ్చితంగా ఓటు వేయండి

మొదటిపేజీ తరువాయి..
అన్ని రాజకీయపార్టీలు ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అలాగే ఓటర్లు తమ ఓటర్ స్లిప్ వేరిఫై చేసుకోవాలని, ఓటు ఉందా లేదా అన్ని సిరచూసుకోవాలన్నారు. వెంకయ్యనాయుడు నివాసంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మవిభూషణ్ స్వీకరించిన వెంకయ్య నాయుడును ఢిల్లీలోని తెలుగు సంఘాలు, ప్రముఖులు, జర్నలిస్టులు అభినందించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ... తాను చేసిన సేవలను గుర్తించి కేంద్రం పద్మ విభూషణ్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఉపరాష్ట్రపతిగా పనిచేసిన తరువాత మళ్ళీ రాజకీయాల్లోకి రావడం మంచిది కాదని భవించా.. అందుకే రాలేదని తెలిపారు. ఇకపై ప్రజలతో ఉంటా అని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను, ఇతర అంశాలను నిన్న కూడా ప్రధానితో చర్చించినట్లు చెప్పారు. ఇకపై పార్టీ రాజకీయాల్లోకి వెళ్ళనని తేల్చిచెప్పేశారు. సాధారణ రాజకీయాల గురించి స్పందిస్తూ ఉంటానని తెలిపారు. వచ్చే రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్నారు. కళాశాలలు, యూనివర్సిటీలు, ఐఐఎం అనేక సంస్థల కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. ప్రజా జీవితంలో ప్రతిఒక్కరు యాక్టివ్ గా ఉండాలని.. ఎవరి పని వారు సక్రమంగా చేయడమే దేశ భక్తి అని చెప్పుకొచ్చారు. నేతలు పార్టీలు మారడం ట్రెండ్‌గా మారిందని.. ఇది డిస్టర్బింగ్ ట్రెండ్ అని వ్యాఖ్యలు చేశారు. పదవికి రాజీనామా చేసి ఏ పార్టీలో అయినా చేరొచ్చన్నారు. పదవులకు రాజీనామా చేయకుండా పార్టీలు మారి నేతలను విమర్శించడం సరికాదన్నారు. యాంటీ డిఫెక్షన్‌లాను బలోపేతం చేయాలని తెలిపారు. రాజకీయపార్టీలు ఏం చేయగలుగుతారో అవే మేని ఫెస్టోలో హామీలుగా ఇవ్వాలని సూచించారు. చెట్లకు డబ్బులు కాయవనేది వాస్తవమన్నారు. తాను ఉచితాలకు వ్యతిరేకమన్నారు. విద్య, ఆరోగ్యం ఉచితంగా ఇవ్వాలని.. ప్రజలు కూడా ఉచితాలను ప్రశ్నించాలని అన్నారు. అసభ్యంగా మాట్లాడేవారు, అవినీతి పరులను ప్రజలు తిరస్కరించాలని కోరారు. పార్టీకి నేనిచ్చే స్థానం నా జీవితంలో మారదు. ఆర్టికల్ 370 రద్దు నేను రాజ్యసభ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఆమోదం పొందడం జీవితంలో గొప్ప అంశం. లోక్‌సభలో మెజారిటీ ఉన్నా మొదట రాజ్యసభలో ప్రవేశపెట్టారు. సభను వాయిదా వేయకుండా నడిపించా. శాంతియుతంగా చర్చల ద్వారా ప్రజాస్వామ్యయుతంగా ఆర్టికల్ 370 రద్దు బిల్లు ఆమోదం పొందింది. రాజకీయ పార్టీలు వారి సభ్యులను పార్లమెంట్ ప్రొసీడింగ్స్ సరిగా జరిగేలా ట్రెయిన్ చెయ్యాలి. దేశం రోజు రోజుకు ముందుకు వెళ్తుంది. ప్రపంచం భారత్ వైపు చూస్తోంది. శత్రు దేశాలు భారత్‌ను చూసి ఓర్చుకోలేక పోతున్నాయి.




# నగరంలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

మొదటిపేజీ తరువాయి..
శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.
మరోవైపు శోభాయాత్రకు ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీస్‌తో పాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఆక్టోపస్ పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. దాదాపు 44 చోట్ల ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెళ్లాలని పోలీసులు సూచించారు. జై హనుమాన్.. జై శ్రీరామ్ అంటూ భక్తుల నినాదాలతో శోభాయాత్ర కొనసాగుతోంది. గౌలిగూడ మందిర్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. గౌలిగూడ నుంచి సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు యాత్ర సాగనుంది. దాదాపు 13 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది. శోభాయాత్రను పురస్కరించుకుని గౌలిగూడ రామ మందిర్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి , ఎమ్మెల్యే రాజాసింగ్ , మాజీమంత్రి ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అయోధ్యలో రాంమందిర నిర్మాణం తర్వాత వచ్చిన మొదటి హనుమాన్ జయంతిని దేశవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో చేసుకుంటున్నారన్నారు. 550 ఏళ్ళ తర్వాత రాం మందిర్‌లో దివ్యమైన రాముణ్ణి ప్రతిష్టించుకున్నామని తెలిపారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది వైభవంగా హైదరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందన్నారు. రాముడు దేశంలోని 140 కోట్ల మందికి దేవుడన్నారు. అందరూ శ్రీరామ చంద్రుణ్ణి దర్శించుకోవచ్చని వెల్లడించారు. ప్రతీసారి లాగే ఈసారి గ్రాండ్‌గా హనుమాన్ శోభాయాత్ర జరుగుతోందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తనపై కావాలని పోలీసులు కేసులు పెట్టారని మండిపడ్డారు. శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా సుల్తాన్ బజార్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో అక్రమ కేసులు పెట్టారన్నారు. పోలీసులు శోభాయాత్రను లేట్ చేశారని.. తనకేమీ కేసులు కొత్తకాదన్నారు. దేశం కోసం ధర్మం కోసం పని చేస్తున్నానని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.

# కూలిన వంతెన

మొదటిపేజీ తరువాయి..
భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి మధ్య దూరం తగ్గించేందుకు వాగుపై ఈ వంతెన నిర్మిస్తున్నారు. 2016లో ఆగస్టులో రూ.49 కోట్లతో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభం కాగా.. మధ్యలో గుత్తేదారులు మారడం, నిధుల లేకపోవడం వంటి కారణాలతో బ్రిడ్జ్ నిర్మాణం ఆలస్యమవుతూ వస్తోంది. ఈ క్రమంలో తొమ్మిదేళ్లు గడిచినా బ్రిడ్జ్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఇప్పటివరకూ 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ప్రస్తుతం అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గంలో స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వంతెన కూలడంతో పెను ప్రమాదం తప్పింది. వంతెన కూలడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆ వైపు రాకపోకలు నియంత్రించారు. పగటివేళ వంతెన కూలుంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు అంటున్నారు. ఈ క్రమంలో వంతెన నాణ్యతపై విమర్శలు వస్తున్నాయి. పిల్లర్లు, గట్టర్లకు మధ్య బ్యాలెన్సింగ్ కోసం పెట్టిన చెక్కలు చెదలు పట్టడంతో గట్టర్లు ఓ వైపు వంగినట్లు తెలుస్తోంది. చాలా రోజులుగా నిర్మాణ పనులు చేపట్టకపోవడం వల్ల బ్యాలెన్స్ తప్పి వంతెన కూలింది.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి..
పూర్తైంది. రాష్ట్రంలో 11 జిల్లాల్లోని 19 కేంద్రాల్లో ఈ వ్యాల్యూయేషన్ పక్రియ చేపట్టారు. అయితే.. గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు తొందరగా ప్రారం భమైన విషయం తెలిసిందే. అలాగే.. ఫలితాలు కూడా కొంత ముందుగానే విడుదల చేస్తున్నారు. అటు, తెలంగాణ ఇంటర్ ఫలితాలు ఈ నెల 24న ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఇంటర్ విద్యా మండలి కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేయనున్నట్లు ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి శ్రుతి ఓజా తెలిపారు. ఇంటర్ ఫస్టియర్, సెకండ్ ఇయర్ పరీక్షల ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు దాదాపు 9,80,978 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో.. 4,78,527 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు కాగా.. 4,43,993 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. ఇక ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం 48,277 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 46,542 మంది విద్యార్థులు ఉన్నారు.




# అఫ్జల్ మెహది కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమాలు అభినందనీయం

**మాజీ మంత్రి జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్**

జహిరాబాద్, 23 ఏప్రిల్, వెలుతురు :
సంగారెడ్డి జిల్లా జహిరాబాద్‌లో అఫ్జల్ మెహది వారి కుటుంబం సభ్యులు ప్రతి నెలా తన స్వంత నిధులతో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు చేయుతనిస్తు తమకు తోచిన సహాయంతో పేన్షన్ అందిస్తున్న తీరును మాజీ మంత్రి జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్ కొనియాడారు. జహిరాబాద్ పట్టణంలోని ప్రవేట్ పంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ఏ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కార్యక్రమానికి హాజరైన మహీళలు, వికలాంగులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని, పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే అర్హూలందరికి ప్రభుత్వం తరఫున పెన్షన్ ఇప్పించెందుకు కృషి చెస్తానని హామి ఇచ్చారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి సురేష్ కుమార్ షేట్కర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ కండెం నర్సింహులు, మండల అధ్యక్షులు రామలింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మొగుడంపల్లి పార్టీ అధ్యక్షులు మక్సూద్, హర్షద్ అలీ, ఖాజా మీయ, మహ్మద్ ఖదిర్, ముర్జల్, రాజు, మహ్మద్ అయుబ్, హాజీ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# అంబేడ్కర్ పూలే సేవా సమితి ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ నర్సింలు

**మహిళ,ప్రజల,విద్యార్థుల, రైతుల సమస్యల పైన డివిజన్ స్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసిన అంబెడ్కర్ పూలె సేవా సమితి అధ్యక్షుడు రహీమ్**


**ప్రధాన కార్యదర్శి వై పండరీ**





**వెలుతురు, నారాయణఖేడ్ ఏప్రిల్ 23 :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిధిలో అంబేడ్కర్ పూలే సేవ సమితి కార్యాలయం లో మంగళవారం రోజు అంబేద్కర్ పూలే సేవా సమితి ప్రెసిడెంట్ అధ్యక్షుడు రహీం ప్రధాన కార్యదర్శి వై పండరీ జిల్లా అధ్యక్షులు బైండ్ల క్రిష్ణ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడిగా ఎస్ నర్సింలును నియమిస్తూ పత్రికా ప్రకటన తెలపడం జరిగింది, ఈ సందర్భంగా అధ్యక్షులు రహీం, ప్రధాన కార్యదర్శి వై పండరీలు మాట్లాడుతూ, డివిజన్‌లోని విద్య, వైద్యం, ఆరోగ్యం, న్యాయం, రెవెన్యూ, రైతు,మహిళ సమస్యలపైన స్పందించి వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, విద్యార్థులకు ప్రజలకు న్యాయం చేయాలని తెలిపారు.

నూతనంగా నియమకమైన అంబెద్కర్ పూలే సేవ సమితి ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ నార్సింలు మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగింది.నారాయణఖేడ్ లో మహిళ, ప్రజల,రైతుల, విద్యార్థుల, రెవెన్యూ, సమస్యల పైన పోరాడుతు నా వంతు కర్తవ్యంగా, బాధ్యతాయుతంగా, అంబెడ్కర్ పూలె సేవా సమితి యొక్క నియమాలను ఎల్లప్పుడూ నడుచు కుంటానని, నడుచుకొని సేవా దృక్పథంతో ముందుకు వెళ్తామని హామీ ఇవ్వడం జరిగింది.



సంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 23:

**సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంత్రి సుధాకర్, జాయింట్ సెక్రటరీగా పాతూరి పద్మ గార్లు నూతనంగా నియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్**



## శ్రీ వీరహనుమాన్ విజయోత్సవ శోభ యాత్ర

**చౌటుప్పల్ వెలుతురు ఏప్రిల్ 23:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గూడెం గ్రామం లో శ్రీ వీరహనుమాన్ విజయోత్సవ శోభ యాత్రలో పాల్గొన్న బిజెపి జిల్లా కార్యదర్శి బత్తుల జంగయ్య గౌడ్. బిజెపి మండల ఉపాధ్యక్షులు పర్నే శ్రీనురెడ్డి. ఓబీసీ మోర్చా మండల ఉపాధ్యక్షులు ముద్దం లింగస్వామి గౌడ్. గిరిజ బాలరాజు. బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు పాలెం వెంకటేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు



**వెలుతురు ఉప్పరపల్లి ఏప్రిల్ 23:** శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పరపల్లిలో హనుమాన్ విగ్రహంకి పూజలు నిర్వహించిన బొక్క బాల్ రెడ్డి బిజెపి రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులేని పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

**CBSC కరికులం, ఇంటర్నేషనల్ పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం.**

**అనుమతి లేని కార్పొరేట్ శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలి.**

**- ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్**




**కరీంనగర్, వెలుతురు, ఏప్రిల్ 23:** ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంకమ్మ తోటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో ఇష్టానుసారంగా కనీసం అనుమతులు లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో విచ్చలవిడిగా పుట్టగొడుగుల పుట్టుక వస్తున్నాయని వారు తెలిపారు. సీబీఎస్ఈ కరికులం, ఇంటర్నేషనల్ పేరుతో కనీసం అనుమతులు లేకుండా గాని హెూర్డింగ్స్ పెడుతూ ప్రచారాలు చేస్తు, అడ్మిషన్లు చేస్తున్న కానీ విద్యాశాఖ అధికారి ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. కనీసం పాఠశాలలో ఫైర్ సేఫ్టీ లేకుండా పాఠశాలలో ప్రారంభిస్తున్న కాని విద్యాశాఖ అధికారులకు కాపాడం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. కావున అనుమతి లేకుండా ప్రారంభించిన పాఠశాలపై చర్యలు తీసుకొని, పాఠశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. లేనియెడల భవిష్యత్తులో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు రోహిత్, సహాయ కార్యదర్శి ఇషాక్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేష్, రాకేష్, సందేశ్, తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

**మండలానికి చెందిన మాజీ సర్పంచ్ , వార్డ్ మెంబర్లు,100 మంది యువకులు**

**ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరిక**

**జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధి చెందాలంటే బిజెపితోనే సాధ్యం**

**జహీరాబాద్ బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు**

**వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 23 :** మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేటలో టెంకటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుధాకర్, మక్త లక్ష్మా పూర్ మాజీ వార్డ్ మెంబర్ సురేష్, మల్కాపూర్ నాయకులు దాసరి నారాయణ ఆధ్వర్యంలో వెంకటేశం, సాయిలు, దానం పల్లి గ్రామానికి చెందిన రమేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బిజెపిలో చేరగా ఎంపీ బీబీ పాటిల్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. దేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సేవలను వివరించి గ్రామాలలో





బిజెపి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. గ్రామ గ్రామాన నరేంద్ర మోడీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి ఓటు హక్కు పై ప్రజలకు అవగాహన కల్పించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కోణం విట్టల్, మాజీ సర్పంచులు సూర్యప్రకాష్, అశోక్ ,సుభాష్, గంగారం, నాయకులు అనిల్, కృష్ణ, సుభాష్, గంగారెడ్డి,సురేందర్ రెడ్డి తదితరులున్నారు.

# దైవారాధనతోనే మనశ్శాంతి

**మాధవానంద సరస్వతి స్వామి ప్రవచనం**

**లోక కళ్యాణం కోసం సామూహిక ర సత్యనారాయణ స్వామి వ్రతాలు**

**41రోజులు మాలాదారణతో హనుమాన్ దీక్షలు సంపూర్ణం**

**తూప్రాన్ చెరువు కట్ట అంజన్న ఆలయంలో ఘనంగా జయంతి వేడుకలు**

**ఆలయ ప్రధాన పూజారి సలాక ఆత్రేయ శర్మ అధ్వర్యంలో**

**వెలుతురు తూప్రాన్ ఏప్రిల్ 23:** దైవారాధన తోనే మనశ్శాంతి లభిస్తుందని తోగిట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ప్రవచనం చెప్పారు. మహిమగల తూప్రాన్ వీరాంజనేయ స్వామి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించిన మాధవ నంద సరస్వతి స్వామి పాద స్పర్శతో ఈ ప్రాంతం అంతా పావనం అయ్యింది. తూప్రాన్ పెద్ద చెరువు కట్ట పై స్వయంభు వీరాంజనేయ స్వామి ఆలయం లో వెలిసి ఆశేష జనం భక్తుల మధ్య భక్తుల మధ్య హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తూప్రాన్ పెద్ద చెరువు కట్ట అంజన్న ఆలయం లో హనుమాన్ జయంతి వేడుకలు ఆలయ ప్రధాన పూజారి సలాక ఆత్రేయ



శర్మ అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాశవానంద సరస్వతి స్వామి హాజరై ప్రసంగించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా హనుమన్ మన్యు పాశుపతం, లక్ష పుష్పార్చన, లక్ష ఆకు పూజ జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు గొప్పగా నిర్వహించడం అందరూ కలిసి చేసుకునే సమూహిక పండుగ అన్నారు. 41రోజులు స్వాముల మాలాదారణతో హనుమాన్ దీక్షలు సంపూర్ణంగా దీక్షా ధక్షులై తూప్రాన్ చెరువు కట్ట అంజన్న ఆలయం లో మాల విరమణ చేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. ఆలయ ప్రధాన పూజారి సలాక ఆత్రేయ శర్మ అధ్వర్యంలో ప్రతి సంవత్సరం తూప్రాన్ లోని హిందువులను అందరినీ ఒకే దగ్గర చేర్చి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తూ భక్తితో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ, కౌన్సిలర్ లు కోడిప్యాక నారాయణ గుప్త, పల్లేర్ల రవీందర్ గుప్త, మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు శివంపేట్ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, లింగారెడ్డిపేట ఎం.పి.టి.సి శ్రీనివాస్ గౌడ్, మురళిగౌడ్, అర్.నాగరాజు, సి.అర్.జానకి రామ్, దేవత రాజులు గుప్త, కోడిప్యాక చిన్న నారాయణగుప్త, చిన్నింగ్ మల్లిఖార్జున్ గౌడ్, గడ్డం ప్రశాంత్ కుమార్, గబ్బుల సిద్ధిరాములుగుప్త, పొగాకు శ్రీనివాస్ గుప్త దంపతులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి పాలన అనుభవం శూన్యం

**మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య**

**హైదరాబాద్,ఏప్రిల్ 23(వెలుతురు):** బీజేపీతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పు అని కేసీఆర్ అన్నారని, గతంలో తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ చేసిన యత్నాలను కేసీఆర్ ఉదాహరించారన్నారు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య.ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ.. ఓ సీనియర్ కాంగ్రెస్ నేత 20 ఎమ్మెల్యేలను తీసుకొస్తా అంటే వారించా అని కేసీఆర్ ఆ రోజు చెప్పారన్నారు. రేవంత్ మాత్రం ప్రతీ సభ లో కేసీఆర్ తన ప్రభుత్వానికి కూలుస్తారన్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని, ప్రభుత్వం రాగానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సిగ్గు లేకుండా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని ఆయన వ్యాఖ్యానించారు. జానారెడ్డి, జైపాల్ రెడ్డిలు అనుభవజ్ఞులు. వారి గురించి కూడా చులకన చేసి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి పాలన అనుభవం శూన్యమని, లాగులో తొండలు అని ఎదో భాష మాట్లాడు తున్నారన్నారు పొన్నాల లక్ష్మయ్య. పాలన చేయమంటే పనికి రాని మాటలు చెబుతున్నాడని, దేవుండ్ల మీద ప్రమాణం చేయడం కాదు ,గతం లో చెప్పిన డెడ్ లైన్ల పై నిలబడ్డాడా అని ఆయన ప్రశ్నించారు. పంట నష్టం మీద ఎపుడైనా ఈ సీఎం స్పందించారా అని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోలు పై ప్రభుత్వం నిజాలు దాస్తోందని, ఆయన గురించి మాట్లాడడమే నాకు సిగ్గు అనిపిస్తుందన్నారు పొన్నాల లక్ష్మయ్య.

# కేసీఆర్‌కు బిగ్ షాక్..

## బీఆర్ఎస్‌కు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన కీలక నేత గుడ్ బై..?

**ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఊహించని షాక్ తగులుతోంది.**

**ఆ పార్టీకి చెందిన ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టీ దేవేందర్ రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం.**

**వెలుతురు సంగారెడ్డి బ్యూరో:** ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఊహించని షాక్ తగులుతోంది. ఆ పార్టీకి చెందిన ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టీ దేవేందర్ రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని ఆయన సన్నిహితులు కూడా ధృవీకరించారు. రెండవ సారి ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గతంలో కాంగ్రెస్ నుంచి ఆయన బీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఇప్పుడు తిరిగి అదే పార్టీలోకి వెళు తున్నారని సన్నిహితులు చెబుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాకకు చెందిన ఆయన సతీమణి మాధురి జడ్పీటీసీగా పనిచేశారు. కొండపాక తాజా మాజీ సర్పంచ్ కూడా. గత కొద్ది రోజుల నుంచి ఆయన బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లో చేరడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

**కొండపాక నుంచి డీసీసీబీ పీఠం పైకి..**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కొండపాకకు చెందిన చిట్టి దేవేందర్ రెడ్డిది రాజకీయ కుటుంబం. ఆయన సతీమణి కొండపాక జడ్పీటీసీగా, కొండపాక సర్పంచ్‌గా పనిచేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీష్ రావులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా చిట్టీ దేవేందర్ రెడ్డికి అవకాశం కల్పించారు. ఎవరూ ఊహించని విధంగా రెండవ సారి చాలా మంది నాయకులు పోటీ పడినప్పటికీ అప్పటి బీఆర్ఎస్ అధిష్టానం ఆయనకే అవకాశం ఇచ్చారు. కేసీఆర్ కుటుంబంతో బాగానే ఉంటున్న ఆయనకు ఏం జరిగిందో ఏమో కానీ ఆ పార్టీని వీడనున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆయన తిరిగి మళ్లీ అదే పార్టీలో వెళ్లడం దాదాపు ఖాయమైందని స్పష్టం అవుతున్నది.

**రెండు రోజుల్లో స్వయంగా ప్రకటన..**

తాను బీఆర్ఎస్ పార్టీ వీడనున్నట్లు స్వయంగా చిట్టి దేవేందర్ రెడ్డి ప్రకటించే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ముఖ్య నాయకులతో కలిసినట్లు తెలుస్తోంది. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో దేవేందర్ రెడ్డికి మంచి సంబంధాలున్నాయి. నర్సారెడ్డి కోరడంతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కూడా ప్రచారం జరుగుతున్నది. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ నుంచి ఇప్పటికే మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ములుగు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సలీంతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇప్పుడు చిట్టి దేవేందర్ రెడ్డి కూడా పార్టీని వీడడం బీఆర్ఎస్ పార్టీకి తీవ్ర నష్టంగానే చెప్పుకోవచ్చు. జిల్లా స్థాయి పదవుల్లో ఉన్నవారు కూడా పార్టీని వీడుతుండడంతో పార్టీలో తీవ్ర చర్చ జరుగుతున్నది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి పరిణామాలు గులాబీ పార్టీకి మింగుడుపడడం లేదు.

# సంపాదకీయం..

## అసలు సమస్యలపై పలాయనవాదం !

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్న పార్టీలే తమ నిజాయితీని నిరూపించుకోవాల్సి ఉంటుంటి. తాము అధికారంలో ఏయే మంచి పనులు చేశామో. ఎవరెవరనికి మంచి జరిగిందో..ప్రజలకు ఏ రకంగా మేలు జరిగిందో చెప్పాలి. కానీ ఈ ఎన్నికల్లో అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న మోడీ జీఎస్టీ, నిరుద్యోగం, ఉపాధి రంగాలపై ఎలాంటి ప్రభావం కలిగిందో వివరించడం లేదు. ప్రజలు ఈ రంగాల్లో ఎంతగా నష్టపోయారో చెప్పడం లేదు. కానీ కొత్త సమస్యలను తెరపైకి తెచ్చి లబ్దిపొందే ప్రయత్నంలో ఉన్నారు. ఇందులో భాగంగా రెండు సమస్యలను తెరపైకి తెచ్చారు. ఇవి ఎంత వరకు లబ్ది కలుగచేస్తాయనన్నది చూడాలి. ఇవి ఏ మేరకు బిజెపికి ఓట్లు తెచ్చి పెడతాయన్నది చూడాలి. ఇందులో కచ్చతీవు ద్వీపం ఒకటి కాగా...నాటి ప్రధాని మోన్మోహన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం మరోటి. ఈ రెంటినీ మోడీ ప్రస్తావిస్తూ ఓట్లకు పోతున్నారు. నిజానికి మంచి పాలన చేసి, దేశానికి మంచి జరిగివుంటే ఇంతగా రచ్చ చేయాల్సిన అవసరం లేదు. యాభైయేళ్ళక్రితం భారత్–శ్రీలంక మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా పాక్ జలసంధిలోని కచ్చతీవు ద్వీపం శ్రీలంక అధీనంలోకి పోయింది. 1974జూన్‌లో ఇందిరాగాంధీ–సిరిమావో బండారునాయకే చేసుకున్న ఈ స్నేహపూర్వక ఒప్పందం మనదేశానికి భద్రతా పరంగా పెద్ద నష్టాన్ని చేకూర్చిందని ప్రధాని నరేంద్రమోడీ తొలిదశ ఎన్నికలకు మందు ప్రస్తావించారు. కొత్త సత్యాలు బయటపడుతున్నాయనీ, దేశానికి వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం గా పొరుగుదేశానికి కట్టబెట్టిందని ఆయన ట్వీట్లు చేశారు. తమిళనాడులో ఎలాగైనా కాలూనాలన్న బలమైన కాంక్ష వల్ల కాబోలు, కచ్చతీవుకు సంబంధించి ఏదో కొత్తగా బయట పడిందని మోడీ అన్నారు. కానీ, తమిళనాట డీఎంకె, అన్నాడీఎంకెలకు ఈ అంశం దశాబ్దాలుగా రాజకీయాస్త్రంగా ఉపకరిస్తున్నదే. తమిళ మత్స్యకారులమీద శ్రీలంక దాష్టీకం ప్రదర్శించినప్పుడల్లా తమిళనాడులో రాజుకొనే వేడి ఇదే. కచ్చతీవు అప్పగింత రాజ్యాంగవ్యతిరేకమని 2008లో జయలలిత సుప్రీంకోర్టులో కేసువేయడం, దానిని వెనక్కి తీసుకోవాలంటే యుద్ధం ఒక్కటే మార్గమని అటార్నీ జనరల్ పేర్కొనడం ప్రధానికి తెలియనివేమీ కావు. మోదీ తొలివిడత పాలనలో బంగ్లాదేశ్‌తో చేసుకున్న ఓ ఒప్పందంతో కాంగ్రెస్ ఈ కచ్చతీవు ఒప్పందాన్ని పోలుస్తోంది. భారతదేశానికి చెందిన 111 చిన్నాచితకా భూభాగాలను బంగ్లాదేశ్‌కు ఇచ్చేస్తూ, ఈ సరిహద్దుల ఒప్పందం కేవలం భూమికి పరిమితమైనది కాదని, రెండు హృదయాల కలయికని మోదీ వ్యాఖ్యానించిన విషయాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తూ ఎదురుదాడికి దిగుతోంది. పదేళ్ళపాలన తరువాత, సరిగ్గా లోక్‌సభ ఎన్నికలముందు కచ్చతీవుతో ముడిపడిన దేశసమగ్రత, భద్రత ప్రధానికి గుర్తురావడం విశేషం. ఇందిరా గాంధీ ఎంతో నిర్లక్ష్యంగా ఈ కీలకమైన ప్రాంతాన్ని లంకకు ఇచ్చేశారని బీజేపీ పెద్దలు రాద్ధాంతం చేయడం ఎన్నికల ఎత్తుగడగానే చూడాలి. దేశభద్రతకు అత్యతం ప్రాధాన్యం ఇస్తున్న మోడీకి కచ్చతీవు ఇంతకాలం గుర్తుకురాకపోవడాన్ని ఏమనుకోవాలి. కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకీ, ఇరకాటంలోకి నెట్టడానికి ప్రయత్నించ డంలో భాగమే అన్న విమర్శలపై సమాధానం రావాల్సి ఉంది. ఇక మరో విషయం దేశ సంపదను ఇతరులకు పంపిణీ చేస్తారని చేసిన వ్యాఖ్యలు. వాస్తవ సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మోడీ కొత్త వ్యూహాలు పన్నుతున్నారని, విషపూరిత భాషతో ద్వేష ప్రసంగాలు చేస్తున్నారని, అయితే ఈ అబద్దాల వ్యాపారానికి ముగింపు దగ్గరకొచ్చిందని కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ప్రజల సంపద అంతా చొరబాటు దారులకు కాంగ్రెస్ తిరిగి పంపిణీ చేస్తుందని ప్రధాని మోడీ రాజస్థాన్ ఎన్నికల ర్యాలీలో చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగగా, కాంగ్రెస్ కూడా భగ్గుమంది. ధరలు పెరుగుదల, నిరుద్యోగం ప్రముఖంగా ప్రస్తావిస్తూ తాజాగా కాంగ్రెస్ విడుదల చేసిన ప్రకటనను షేర్ చేస్తూ మోడీ ప్రస్తావించారు. ప్రధాని మోడీ అనేక సమస్యలపై విషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. ఒక చిన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాలి. 1951 నుంచి ప్రతి పదేళ్ల కోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తుంటారు. దీనివల్ల షెడ్యూల్ కులాలు, తెగల జనాభా ఎంత ఉందో వాస్తవంగా తెలుతుంది. 2021లో జనాభా లెక్కలు జరగాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు జరగ లేదు. ఈ విషయంలో ప్రధాని ఎందుకు మౌనంగా ఉంటున్నారని కాంగ్రెస్ మరో విషయాన్ని లేవనెత్తింది. దీనిపై కాంగ్రెస్ నేత జైరమ్ రమేశ్ ప్రశ్నించారు. ఇది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని నాశనం చేయడానికే ఈ కుట్ర అని ఆయన ఆరోపించారు. ప్రధాని మోడీని ఓటమి భయం వెంటాడుతోందని, అందు కోసమే రెండు మతాల మధ్య చిచ్చు పెట్టే మాటలకు తెరలేపారని కాంగ్రెస్ నేతలు విరుచుకుపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను ముస్లింల కు పంచి పెడుతుందంటూ మోడీ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమైనవన్నారు.

కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిందని, ఏ నాడూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోలేదని పేర్కొన్నారు. మొత్తంగా ఇప్పుడు ఎన్నికల వేళ ప్రజలకు సంబంధం లేని రెండు విషయాలపై చర్చ సాగదీస్తున్నారు. పదేళ్లుగా అధికారం లేక చేవచచ్చిన కాంగ్రెస్‌ను మోడీ ఎందుకు ఇంకా వెన్నాడుతున్నారన్నదే సమస్య. ప్రజలకు మంచి చేస్తే మంచి గురించి చెప్పాలి. కానీ ఏనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మోడీ ప్రస్తావించడం లేదు. తాను చేసిందే అంతా మంచి అనే భావనలో ఉన్నారు. అందుకే ఏదో భయం ఆవరించి ఉంటుందని కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. ఈ క్రమంలో ప్రజలు కూడా ఎవరేంటో పరిశీలించుకునే అవకాశం ఉంది.

## 51వ పడిలో అడుగిడిన లిటిల్ మాస్టర్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న సచిన్ టెండూల్కర్ అంటే తెలియచని వారు ఉండరు. పిన్న వయసులోనే క్రికెట్లోకి అడుగు పెట్టిన సచిన్ ఎన్నో ఉన్నత శిఖారుల అధిరోహించాడు. ఈ నెల 24తో 51వ పడిలోకి ప్రవేశించబోతున్నాడు.




క్రికెట్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించి తన పేరుపై లెక్కలేనని రికార్డులు రాసుకున్న సచిన్ బర్త్ పుట్టిన రోజు అభిమానులకు చాలా ముఖ్యమైన రోజు. భారత క్రికెట్ చరిత్రలో సచిన్ లేకుండా పేజీ లేదు. సచిన్ పుట్టిన రోజు సందర్భంగా అతని గురించి అనేక ఆస్తకర విషయాల్లో కొన్ని ... ఫిబ్రవరి 1988లో సచిన్ టెండూల్కర్–వినోద్ కాంబ్లీ కలిసి 664 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పోటీ క్రికెట్‌లో ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఆ మ్యాచ్‌లో సచిన్ 326 పరుగులతో అజేయంగా నిలిచాడు. నవంబరు 1989లో 16 ఏళ్ల వయసులో సచిన్ కరాచీలో పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. అయితే తరువాత ఏడాది అంటే ఆగస్టు 14, 1990లో ఓల్డ్ మాంచెస్టర్‌లో జరిగిన టెస్టులో సచిన్ తొలి సెంచరీ నమోదు చేశాడు. 1996 వన్డే ప్రపంచకప్‌లో 523 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 24 ఫిబ్రవరి 2010లో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అజేయంగా 200 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.

## శక్తి స్వరూపాన్ని చూడగలమా! (ఆధ్యాత్మిక చింతన)

చాలామంది ఇప్పటికీ దేవుడు ఉన్నాడా..ఉంటే చూపండి అన్న వింతవాదన చేస్తుంటారు. ఉంటే ఎలా ఉంటాడో చూపాలంటారు. నిజానికి దేవుడు శక్తి స్వరూపం..ప్రతి అణువులో వివిధ రూపాల్లో ఉంటాడన్న నిజం తెలుసుకోవడం లేదు.

నిజానికి దేవుడు విద్యుచ్ఛక్తి లాంటివాడు. విద్యుత్తును ఒకసారి చూపమని అడిగితే ఎవరూ చూపించలేరు. విశాల విశ్వంలో సంభవించే నిరంతర పరిణామాలకు కారణమవుతున్నది, మనిషి మేధ అందుకోలేకపోతున్న అజ్ఞాతశక్తి– ఒకటే. గాలిలోని ప్రాణవాయువు జీవి కళ్లకు కనపడనంత మాత్రాన లేకుండా పోదు. దాన్ని జీవశక్తిగా నమ్ముతున్నప్పుడు జీవులకు ప్రాణం పోస్తున్న ఆ శక్తిని దేవుడనడానికి అభ్యంతరం ఉండకూడదు. దేవుడు లేడనేవారి మనోభావనలను నిరసించి గాయపరచడాన్ని హైందవ సనాతన ధర్మం ఎన్నడూ ఆమోదించలేదు. ఉన్నాడని చెప్పేందుకు తార్కిక వాదనలను వినిపించింది. దేవుడంటే ఎవరేది చెప్పినా వినగల సహనం నేర్పించింది. చార్వాకుడి నాస్తిక వాదాన్ని కించపరచలేదు. ఋషులకిచ్చిన గౌరవమే ఆయనకు ఇచ్చింది. విశ్వమంతా నిండి ఉన్న చైతన్యమంతా దేవుడేనని, అతడు రూపగుణ విశేషాలుండని తనలోనే ఉన్న దివ్య చైతన్యమని, అందులో తానొక అణువులో అణుమాత్రమైనా కాని అంశమని వేదాంతం తెలుసుకొమ్మంటుంది. వేదాంతం అర్థమైతే... దేవుడంటే వెలుగని గ్రహించి– భౌతిక లోకంలో చీకట్లు తనను ఏ రూపంలో వేధిస్తున్నా మనిషి భయపడడు!అందుకే మనమంతా శక్తితో చూడాలి. అన్వేషించాలి. తపన చెందాలి. అపపుడే భగవత్ సాక్షాత్కారం దక్కగలదు.


# టెస్లా ప్రకంపనలు

అమెరికన్ బిలియనీర్ ఎలెన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా విద్యుత్ వాహనాలు త్వరలో భారతదేశ మార్కెట్‌లో ప్రవేశించబోతున్నాయనే వార్తలు దేశీయ ఆటోమొబైల్ రంగంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎప్పటి నుంచో భారతదేశ మార్కెట్‌పై కన్నేసి కేంద్రంతో అనేక దఫాలు లాబీయింగ్ చేసిన మస్క్ ప్రయత్నాలు కొంత మేరకు ఫలించడంతో కేంద్రం మెత్తబడి కొన్ని షరతులతో విదేశీ విద్యుత్ వాహనాలకు అనుమతి ప్రకటించింది. ఎలెన్ మస్క్ ఈ నెల 22వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీతో స్వయంగా భేటీ కాబోతున్నారు.

ఈ భేటీ తర్వాత కీలక ప్రకటన రావచ్చని అంటున్నారు. ఇప్పటికే టెస్లా వాహన ఉత్పత్తికి రారమ్మంటూ అనేక రాష్ట్రాలు మస్క్‌కు ఆహ్వానాలు పంపాయి. మోడీతో భేటీ తర్వాత ఏ రాష్ట్రంలో టెస్లా విద్యుత్ వాహన ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తారో ప్రకటన రావచ్చని చెబుతున్నారు. టెస్లా ప్రవేశంతో దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు రావొచ్చని నిపుణులు అంటున్నారు. ఈ ఏడాది లేదా వచ్చే ఏడాది ప్రారంభం నాటికల్లా టెస్లా వాహనాలు భారత్‌కు దిగుమతి అవుతాయని, మూడేళ్ళల్లో ఇక్కడే ఉత్పత్తి అవుతాయని టెస్లాను ఉటంకిస్తూ కేంద్ర అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇవి వాహనాల విద్యుత్ ఉత్పత్తి భారత్‌లో చేపట్టడానికి టెస్లాతో పాటు విన్‌ఫాస్ట్, చైనాకు చెందిన బివైడి, కియా, స్కోడా, మెర్సిడెస్‌బెంజ్, బిఎండబ్లు కంపెనీలు క్యూ కట్టాయి.

ఇందులో ఏ కంపెనీలు ముందుగా వస్తాయో ఇప్పటికైతే తెలియదు. విదేశాల నుంచి కార్ల దిగుమతులపై ప్రభుత్వం 60 నుంచి 100 శాతం దాకా కస్టమ్స్ డ్యూటీలు విధిస్తోంది. దీనితో ఇక్కడకు దిగుమతి అయ్యే కార్ల ధర భారతీయులు భరించలేని విధంగా ఉంది. కస్టమ్స్ డ్యూటీలు తగ్గించాలని మస్క్ అనేక మార్లు ఎక్స్‌లో ప్రభుత్వానికి, ప్రధానికి విజ్ఞప్తి చేశారు. కాని కేంద్రం మస్క్ లాబీయింగ్‌కు తలొగ్గలేదు. స్థానికంగా కార్లను ఉత్పత్తి చేస్తేనే కస్టమ్స్ డ్యూటీలు తగ్గిస్తామని, అది కూడా దేశీయ కార్ల కంపెనీలకు నష్టం జరగకుండా షరతులు పెడతామని కేంద్రం సమాధానం ఇచ్చింది. కేంద్రం పెట్టే షరతులకు మస్క్‌తో సహా మరి కొన్ని అంతర్జాతీయ కార్ల కంపెనీలు ఎస్ చెప్పడంతో కేంద్రం ఇటీవలే విదేశీ కార్ల దిగుమతి విధానాన్ని ప్రకటించింది.

ఈ విధానం ప్రకారం విదేశాలకు చెందిన ఏ కంపెనీ



అయినా మూడేళ్ళలో భారత దేశంలో కార్ల ఉత్పత్తికి రూ. 4150 కోట్ల పెట్టుబడితో ఫ్యాక్టరీ పెడితే ఆ కంపెనీకి చెందిన విదేశీ కార్ల దిగుమతి సుంకాన్ని 15 శాతానికి తగ్గిస్తామని ప్రకటించింది. అయితే దిగుమతి అయ్యే కార్ల ధరలు రూ. 29 లక్షలకు పైనే ఉండాలని షరతు నిర్ధారించింది. నిజానికి దేశంలో ఎక్కువగా కార్లు 10 నుంచి 25 లక్షల ధరల మధ్య అమ్ముడుపోతున్నాయి. దేశీయంగా మహీంద్ర, టాటా కంపెనీలు ఈరేంజ్ లోనే విద్యుత్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. రూ. 29 లక్షల పైన ఖరీదు చేసే లగ్జరీ కార్లకు మాత్రమే 15 శాతం సుంకం చెల్లించాలని, ఏడాదికి దిగుమతి చేసే విదేశీ కార్లు 8 వేలకు మించకూడదని కూడా కేంద్రం షరతులు పెట్టింది.

ఈ మేరకు కేంద్రం షరతులకు అంగీకరించి ఎంఒయు చేసుకుంటేనే తొలుత కార్ల దిగుమతికి, కార్ల ఉత్పత్తికి రాయితీలు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఈ విధానానికి టెస్లాతో సహా పలు కంపెనీలు స్వాగతం చెప్పాయి. అయితే దేశీయ కంపెనీలు మాత్రం టెస్లాను వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో ఛార్జింగ్ వ్యవస్థ మెరుగుపరచకుండా విదేశీ కార్ల దిగుమతి, ఉత్పత్తికి పచ్చజెండా ఊపడం పలు దుష్పరిణామాలకు దారి తీస్తుందని దేశీయ ఆటోమొబైల్ కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాని కేంద్రం విద్యుత్ వాహనాల అధికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నది. 2030 కల్లా దేశంలో 30 శాతం కార్లు విద్యుత్‌లోకి మారిపోవాలని దీనివల్ల పర్యావరణంతోపాటు కేంద్రంపై ముడి చమురు భారం, వ్యక్తిగతంగా కార్ల వినియోగదారులపై ధరల పోటు తగ్గుతుందని, ఇది అందరికీ ఆమోదయోగ్యం అవుతుందని కేంద్రం చెబుతున్నది.

దేశంలో పెట్రోల్ బంకుల మాదిరిగా ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ కార్లకు కీలకమైన లిథియం ఇయాన్ బ్యాటరీల ఉత్పత్తిని కూడా కేంద్రం ప్రోత్సహిస్తున్నది. తద్వారా దేశంలో విద్యుత్ వాహనాల శకం ప్రారంభమవుతుందని ఇప్పటికే చైనా, అమెరికా, జపాన్ లాంటి దేశాలతో పోలిస్తే దేశం బాగా వెనుకబడి ఉందని కేంద్రం అంటున్నది. విద్యుత్ కార్ల ఉత్పత్తిలో విదేశీ కంపెనీలతో పోటీ పడితే దేశీయ కంపెనీలు కూడా టెక్నాలజీ పెంచి కార్ల ధరలను కూడా తగ్గిస్తాయని కేంద్రం చెబుతున్నది. దిగుమతి సుంకాలు తగ్గితే విదేశీ కార్ల ధరలు కూడా దేశంలో 20 నుంచి 30 లక్షలకు క్రమంగా తగ్గవచ్చని ఆటోమొబైల్ కంపెనీలు కూడా అంటున్నాయి.

మొత్తంగా టెస్లా ఎంట్రీతో ఆటోమొబైల్ స్వరూప స్వభావాలు సమూలంగా మారుతాయనడంలో సందేహం లేదు.

# సుత్తి కొడవళ్ళకు పదును పెట్టాలి

ఎదపై ఎర్ర జెండాను ఎగరవేస్తూ అరుణ పతాకాన్ని చేబూని అడుగులో అడుగు వేస్తున్నా ఓటుకు వచ్చి సరికి జనం ఎందుకు దూరం అవుతున్నారన్న అంశాన్ని సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీల నాయకత్వం లోతుగా విశ్లేషణ చేయాల్సిన బాధ్యత ఉంది. ఓటును భౌతికంగా మల్చుకోవడంలో ఎత్తుగడను రూపొందించ డం లేదా! అన్న భావన కలుగుతోంది. సభలకు, సమావేశాలకు, ఆందోళనలకు తరలివచ్చి అరుణ పతాకంతో కదంతొక్కే తాడితులు, పీడితులు, శ్రామికులు ఓటు వేస్తున్నప్పటికీ ఇతర వర్గాలకు దగ్గర కావడం లేదా! అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.



రాటాల కొలిమి నుంచి ఎగిసిపడినవే సుత్తి కొడవళ్ళు. జనహృదయాల్లో అరుణ తారలై నిలుస్తున్నాయి వామపక్షాలు. బుద్ధి జీవుల, కష్ట జీవుల సమస్యలను జెండాగా.. ఎజెండాగా రూపొందించి పోరాట కొలిమిలో సుత్తీ కొడవళ్ళకు పదును పెడుతున్నాయి సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీలు. ఏ సమస్య వచ్చినా గుండెగుండెను కదిలించి, గడప గడపను పలకరించి అరుణ సైన్యంలా పోరాట పథంలో సాగుతున్న సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీల ప్రాధాన్యత లోక్‌సభలో క్రమంగా తగ్గుతొంది. లోక్‌సభలో జనగళాన్ని వినిపించడానికి వామపక్ష పార్టీల ప్రధానంగా సి.పి.ఐ, సి.పి.ఎం సభ్యుల సంఖ్య పెరగాల్సి వుండగా, 1984 నుంచి 2019 ఎన్నికల వరకు తగ్గుతూ వస్తోంది. 1951 లోక్‌సభ ఎన్నికల నుంచి 1984 ఎన్నికల వరకు సి.పి.ఐ, 1967 ఎన్నికల నుంచి 1984 ఎన్నికల వరకు సి.పి.ఎం సభ్యుల సంఖ్య లోక్‌సభలో గణనీయంగా ఉండేది.

ఎదపై ఎర్ర జెండాను ఎగరవేస్తూ అరుణ పతాకాన్ని చేబూని అడుగులో అడుగు వేస్తున్నా ఓటుకు వచ్చి సరికి జనం ఎందుకు దూరం అవుతున్నా రన్న అంశాన్ని సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీల నాయకత్వం లోతుగా విశ్లేషణ చేయాల్సిన బాధ్యత ఉంది. ఓటును భౌతికంగా మల్చుకోవడంలో ఎత్తుగడను రూపొందించడం లేదా! అన్న భావన కలుగుతోంది. సభలకు, సమావేశాలకు, ఆందోళనలకు తరలివచ్చి అరుణ పతాకంతో కదంతొక్కే తాడితులు, పీడితులు, శ్రామికులు ఓటు వేస్తున్నప్పటికీ ఇతర వర్గాలకు దగ్గర కావడం లేదా! అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 1951లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సి.పి.ఐ 99 స్థానాల్లో పోటీ చేయగా 16 స్థానాల్లో విజయం సాధించి 3.29 శాతం ఓట్లు సాధించగా, 1957 లో 110 స్థానాల్లో పోటీ చేయగా 27 స్థానాల్లో విజయం సాధించి 8.29% ఓట్లు వచ్చాయి.

1962లో 137 స్థానాల్లో పోటీగా 29 స్థానాల్లో విజయం సాధించి 9.94 శాతం ఓట్లు రాగా, 1967లో 109 స్థానాల్లో పోటీ చేయగా 23 స్థానాల్లో గెలుపొంది. 5.11 శాతం ఓట్లు వచ్చాయి. 1971లో 87 పోటీ చేయగా 23 స్థానాల్లో సాధించి 4.73 శాతం ఓట్లు, 1977లో 81 స్థానాల్లో పోటీ చేసి 7 స్థానాల్లో విజయం సాధించి 2.82 శాతం వచ్చాయి. 1980లో 47 స్థానాల్లో పోటీ చేసి 10 స్థానాల్లో గెలిచి 2.49 శాతం, 1984లో 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో విజయం సాధించి 2.71 ఓటింగ్ శాతం వచ్చింది. 1989లో 50 స్థానాల్లో పోటీ చేసి 12 స్థానాల్లో విజయం సాధించి 2.57% ఓట్లు, 1991లో 42 స్థానాల్లో పోటీచేసి 14 స్థానాల్లో విజయం సాధించి 2.49 శాతం ఓటింగ్‌ను సి.పి.ఐ సాధించింది. 1996లో 43 స్థానాల్లో పోటీ చేయగా 12 స్థానాల్లో విజయం సాధించి 1.93 ఓటింగ్ శాతం, 1998లో 58 స్థానాల్లో పోటీ చేసి 9 స్థానాల్లో విజయం సాధించి 1.79% ఓటింగ్‌ను సాధించింది.

1999లో 54 స్థానాల్లో పోటీ చేసి 4 స్థానాల్లో గెలిచి 1.48% ఓటింగ్ సి.పి.ఐ పొందింది. 2004లో 34 స్థానాల్లో పోటీ చేసి 10 స్థానాల్లో జయభేరి మోగించి 1.41%, 2009లో 56 స్థానాల్లో పోటీ చేసి 4 స్థానాల్లో విజయం సాధించి 1.43 శాతం ఓటింగ్‌ను పొందింది. 2014లో 67 స్థానాల్లో పోటీ చేసి 1 స్థానాల్లో గెలిచి 0.79 శాతం, 2019లో 49 స్థానాల్లో పోటీ చేసి 2 స్థానాల్లో గెలచి 0.59 శాతం ఓటింగ్‌ను పొందింది సి.పి.ఐ. కాగా 1967 నుంచి 2019 వరకు సి.పి.ఐ (ఎం) సాధించిన ఫలితాలను చూద్దాం. 1967లో 59 స్థానాల్లో పోటీ చేయగా 19 స్థానాలు గెలిచి 4.28 శాతం ఓట్లు, 1971లో 85 స్థానాల్లో పోటీ చేసి 25 స్థానాల్లో విజయం సాధించి 5.12 ఓటింగ్ శాతాన్ని పొందింది.

1977లో 53 స్థానాల్లో పోటీ చేసి 22 స్థానాల్లో గెలిచి 4.29% ఓటింగ్, 1980లో 64 స్థానాల్లో పోటీ చేసి 37 స్థానాల్లో విజయం సాధించి 6.24 శాతం ఓటింగ్‌ను సి.పి.ఎం పొందింది. 1984లో 59 స్థానాల్లో పోటీ చేసి 22 స్థానాల్లో గెలిచి 5.81% ఓటింగ్, 1989లో 64 స్థానాల్లో పోటీ చేసి 33 స్థానాల్లో విజయం సాధించి 6.55 శాతం ఓటింగ్‌ను పొందింది. 1991లో 60 స్థానాల్లో పోటీ చేసి 35 స్థానాల్లో విజయం సాధించి 6.15% ఓట్లను పొందింది. 1996లో 75 స్థానాల్లో పోటీచేసి 32 స్థానాల్లో విజయం సాధించి 6.12% ఓటింగ్‌ను సాధించగలిగింది. 1998లో 71 స్థానాల్లో పోటీ చేసి 32 స్థానాల్లో విజయ భేరి మోగించి 5.15% ఓటింగ్‌ను సాధించింది.

1999లో 72 స్థానాల్లో పోటీ చేసి 33 స్థానాల్లో విజయం సాధించి 5.40% ఓటింగ్‌ను పొందింది. 2004లో 69 స్థానాల్లో పోటీ చేసి 33 స్థానాల్లో గెలిచి 5.66% ఓటింగ్‌ను పొందింది. 2009లో 82 స్థానాల్లో పోటీచేసి 16 స్థానా లు గెలిచి 5.33% ఓటింగ్‌ను సాధించింది. 2014లో 93 స్థానాల్లో పోటీ చేసి 9 స్థానాలు గెలిచి 3.28% ఓటింగ్‌ను, 2019లో 69 స్థానాల్లో పోటీ చేసి 3 స్థానాల్లో విజయం సాధించి 1.77% ఓటింగ్‌ను పొందింది. 1999, 2009, 2014, 2019లో జరిగిన ఎన్నికలు సి.పి.ఐ ను నిరాశ కల్పించగా, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు సి.పి.ఎంకు ఆందోళన కలిగించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సుత్తికొడవళ్ళకు సానబెట్టి ఎన్నికల కురుక్షేత్రంలో అరుణ పతాకాన్ని రెపరెపలాడించాల్సిన బాధ్యత సి.పి.ఐ, సి.పి.ఎం నాయకత్వం పై ఉంది.

# జనాభా నియంత్రణ అత్యావశ్యకం

ప్రపంచ జనాభాలో అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ రికార్డులకు ఎక్కింది. చైనాను వెనక్కి నెట్టి 144 కోట్ల జనాభాతో మనం ముందు వరసలో నిలబడ్డాం. ఇది అభివృద్ధికి సూచిక కాదని గుర్తించాలి. వెనకబడి పోవడానికి..ఆర్థికంగా మరిందగా దెబ్బతినడానికి సూచికగా గుర్తించాలి.

కొన్ని దేశాల్లో జనాభా పెరిగింది. కొన్ని దేశాల్లో జన సంఖ్య తగ్గుముఖం పట్టింది. వృద్ధుల సంఖ్య పెరిగి, యువ జనాభా తగ్గడం కూడా ఆందోళన కలిగించే విషయమే. తక్కువ భూభాగం కలిగి.. ఎక్కువ జనాభాతో బాధపడే దేశాలు అభివృద్ధిని సాధించలేవని ఈ సందర్భంగా పాలకులు గుర్తించాలి. ఈ అనుభవంతో జనభా నియంత్రణకు మనం నడుం బిగించకపోతే.. అధోగతి పాలవుతామని గుర్తించాలి. ఇలా జనాభా పెరుగుతూ పోతుంటే.. ఎంతగా పంటలు పండించినా తిండిగింజలు దొరకవు. అలాగే నిరుద్యోం పెరుగుతుంది. అధిక జనాభాతో బాధపడే దేశాల్లోని ప్రజలకు అన్ని సదుపాయాలూ కల్పించడం కష్టం. ఈ కారణంగానే చాలా దేశాలు వెనకబడే ఉంటున్నాయి. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వాలు, ప్రజలు అర్థం చేసుకోవాలి. జనాభాను తగ్గించుకుని, పేదరికాన్ని పారదోలాలి. లింగ వివక్షతను రూపు మాపి, సమానత్వాన్ని, మానవత్వాన్ని మెరుగు పరచి మానవ హక్కులను కాపాడాలి. ఇందుకు అనుగుణంగా జనాబా నియంతరణకు ఎవరికి వారు పాటుపడాలి. ఆధునిక ప్రపంచంలో చాలా గ్రామాల్లో తాగునీరు లేక వ్యాధుల బారిన పడుతున్నారు.

నగరాలన్నీ మురికి కూపాలుగా మారిపోతున్నాయి. కుటుంబ పోషణార్థం బాలలు వెట్టిచాకిరీ వైపు పయనిస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థ పురుడు పోసుకోవడానికి ఆర్థిక లేమి కారణమౌతున్నది. విద్యా సౌకర్యాలు లేక, పట్టించుకునే వారు కరువై వీధి బాలలుగా మారే వారి సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో పెరిగే అవకాశముంది. జనాభా పెరుగుదల వలన కలిగే దుష్ఫరిణామా లను క్యరాజ్యసమితి దశాబ్దాల క్రితమే



కార్యాచరణ ప్రారంభించింది. పలు ప్రపంచ దేశాలు సైతం చేతనైన ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, ప్రపంచ ప్రజల, ప్రభుత్వాల ఆలోచనా విధానంలో మార్పు రాకపోతే ఫలితం శూన్యం. కాబట్టి జనాభా పెరుగుదల వలన కలిగే విపత్కర పరిణామాలపై ప్రజల్లో నిరంతర చైతన్యం కలిగించాలి. 800 కోట్లకు చేరువలోనున్న ప్రపంచ జనాభాకు అన్ని వసతులు సమకూర్చవలసిన బాధ్యత వాటిపై ఎంతైనా ఉంది. ఇప్పటికే అడవులను, పచ్చని భూములను ధ్వంసం చేసి, పర్యావరణాన్ని నాశనం చేసేశారు. దాని ఫలితాలను ప్రజలు చవిచూస్తున్నారు. సరైన వసతి లేదు. ఆహార భద్రత లేదు. విద్యా వైద్య సదుపాయాలు గగన కుసుమంలా మారాయి.

జనాభాను గణనీయంగా తగ్గించుకునే అవకాశాలను ఆచరించాలి. జనాభాలో వృద్ధుల శాతం పెరుగడటంతో చైనా వన్ చైల్డ్ విధానానికి వీడ్కోలు చెప్పింది. ఇద్దరు పిల్లలను కనేందుకు జంటలకు అనుమతి ఇచ్చింది. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌లో జనాభా విస్ఫోటనం జరిగింది. కాని ప్రస్తుతం జనాభా తగ్గుముఖం పడుతున్నది. ఇటలీ జనాభా తరిగిపోయి, వృద్ధులు పెరిగిపోతున్నారు. జపాన్ జనాభాలో సగం మంది వృద్ధులు వుండే అవకాశాలున్నాయి. భారత జనాభా చైనాను అధిగమిస్తుందని అంచనా ఇప్పుడు నిజమయ్యింది. జన విస్ఫోటనం మధ్య మానవాళి ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆహార, ఆవాస, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ప్రపంచమంతా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రపంచ దేశాలన్నీ నిర్దిష్టమైన ప్రణాళిక, కార్యాచరణతో సమిష్టి తత్వంతో ముందుకు సాగాలి. అందుకు ఏ దేశం ఆ దేశం కార్యాచరణ చేయాలి. ఇందులో భారత ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలి. జనాభా నియంత్రణ అన్నది జాతీయ కార్యాచరణ కావాలి. ప్రజలను చైతన్యం చేయడంతో పాటు..బలవంతంగా నియంత్రణ పద్ధతులు అవలంబిచేలా చేయాలి. లేకుంటే దేశంలో ఆర్థిక సంక్షోభం బద్దలు కాగలదు.



## హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

**కూకట్‌పల్లి వెలుతురు:** కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు ఆలయాలలో హనుమాన్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ నియోజకవర్గంలోని పలు ఆలయాలను దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో బేగంపేట్ డివిజన్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర మహిళా నాయకురాలు పుష్పా రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, బేగంపేట రమేష్, టోచర్, గంధం రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దయాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సంజీవ రెడ్డి


**మేడిపల్లి వెలుతురు:** మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ దర్గ దయాకర్ రెడ్డి పుట్టినోజు



సందర్భంగా...మాజీ జడ్.పీ.టీ.సి,బోడుప్పల్ బి.ఆర్.ఏస్ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి పూల బొకేను అందజేసి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,మోతె రాజు,తదితరులు పాల్గొన్నారు.

## విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన ఎన్నిక..

**కూకట్‌పల్లి, వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికలో సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ , ఉపాధ్యక్షులుగా మురళీ కృష్ణ మోహన్, లింగారెడ్డి, రఘుపతి రావు, ప్రధాన కార్యదర్శిగా స్వరూప, నిర్వహక కార్యదర్శిగా



హన్మంతరావు, కోశాధికారిగా శ్రీనివాస్రావు, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్, శ్రీధర్, కిషోర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్రెడ్డి, చిన్న కొండయ్య, హన్మంతరావు, శ్రీధర్, శ్యామలరావు, వినోద్, రామకోటేశ్వర్‌రావు, లావణ్య, గోపాల్‌లు ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధికి పాటుపడతామని నూతన కార్యవర్గ అధ్యక్షులు సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన సంఘ ప్రతినిధులను కాలనీ వాసులు అభినందించారు.

## నరేంద్ర మోడీకి అండగా నిలవాలి..

**- కొండా రిషిక రెడ్డి**

**శేర్లింగంపల్లి, వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు మాణిక్ ఆద్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కోడలు కొండా రిషిక రెడ్డి తో పాటు కాంటెస్టెడ్ దేవరకొండ ఎమ్మెల్యే రవి కుమార్



యాదవ్ మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరోసారి దేశం లో మోడీ రావాలి అని, అందరు నరేంద్ర మోడీకి అండగా నిలవాలి అని, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని అధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు రాఘవేంద్రరావు, నాగులు గౌడ్ మాణిక్ రావు. గుండె గణేష్ ముదిరాజ్, రాము, వినోద్ యాదవ్ ,బాబు ముదిరాజ్, నరసింహ, శివ, లక్ష్మణ్, మొదలగు వారు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ మానుకోట అభ్యర్థికి శుభాకాంక్షలు తెలిపిన ఓయూ నేతలు

**మహబూబాబాద్, వెలుతురు న్యూస్:** మహబూబాబాద్ పార్లమెంటు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత నామినేషన్ సందర్భంగా కవితని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థినేతలు జితేందర్ ప్రజాపతి, వీరేందర్ గౌడ్,కారేపోతుల యాకూబ్ గౌడ్, బొమ్మకంటి వెంకట్ గౌడ్



# వాడుకుని వదిలేసే చరిత్ర కేసిఆర్‌ది

### కాంగ్రెస్ పార్టీలో చేరిన తెలంగాణ గిరిజన జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ సక్రూ నాయక్

### మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన సక్రూ నాయక్

### కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి

**మేడిపల్లి, వెలుతురు:** తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సేవలను వాడుకొని వదిలేసిన చరిత్ర కేసిఆర్ దని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన తెలంగాణ గిరిజన జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ సక్రూ నాయక్ పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కార్పొరేటర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మరియు మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆయనకు వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గిరిజనులకు ఎంతో మేలు జరిగిందని వజ్రేష్ యాదవ్ అన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్ర గిరిజన జాగృతి రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్న ఇస్లావత్ సక్రూ నాయక్ రాష్ట్రంలోని బంజారా జాతిని ఏ తాటిపైకి తేవడానికి తెలంగాణ గిరిజన జాగృతిని ఏర్పాటు చేసి ఎన్నో ఉద్యమాలకు



శ్రీకారం చుట్టారు. అలాగే గిరిజన జాగృతి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, మేడిపల్లి సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యటించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను గిరిజనులకు చాటి చెప్పడంతో పాటుగా వారిలో ఐక్యతకు దోహదం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీ గూటికి చేరడం విశేషం. ఈ సందర్భంగా ఇస్లావత్ సక్రూ నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని పలువులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, పీర్జాదిగూడ నగర కార్పొరేటర్లు అమర్ సింగ్, బీంరెడ్డి నవీన్ రెడ్డి, నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, దర్గా దయాకర్ రెడ్డి, కంది రంజిత్ కుమార్ రెడ్డి, దేశగోని శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మరింత అభివృద్ధికై హస్తంకు ఓటు వేయండి...

### చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ భీమ్ భరత్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి( వెలుతురు న్యూస్):** మంగళవారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం ముబారక్ పూర్, గంగ్యాడ, గుబ్బడిపత్తే పూర్ గ్రామాలల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి భీమ్ భరత్ కరపత్రాలు పంపిణి చేసి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ మాటిస్తే తప్పదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అన్నింటినీ ప్రజలకు అందిస్తుందని చెప్పారు. త్వరలోనే 15ఆగస్టుకు రైతుల రుణమాఫీకూడా జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇవ్వలేని బీజేపీ.. రాముడి పేరుతో మాత్రం రాజకీయాలు చేస్తోందని ఫైర్ అయ్యారు. మతం అడ్డుపెట్టుకుని ఓట్లు దండుకునే ప్లాన్‌ను బీజేపీ అవలంబిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీనుండి కాంగ్రెస్ పార్టీలో యూసుఫ్ ఆధ్వర్యంలో భారీగా చేరిన గుబ్బడిపత్తేపూర్ గ్రామస్తులు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య,మహిళా మండల అధ్యక్షురాలు ప్రభావతి ఆనందం, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి,కొండల్ యాదవ్, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,సంజీవ్ రెడ్డి, శివ ప్రసాద్,కిసాన్ సెల్ అధ్యక్షులు గుండాల శ్రీనివాస్ రెడ్డి,ఎంపీటీసీ ఏగ్బాల్,బీ బ్లాక్



కన్వీనర్ కే.వెన్నెల,మాజీ ఉప సర్పంచ్ గోపాలకృష్ణ,ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ నాయకులు ఆనందం,నాగ భూషణం, మహిళా నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ విద్యార్థులకు అల్పహారాన్ని అందించడం అభినందనీయం

### ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త మర్పల్లి అశోక్

**శంకర్‌పల్లి ఏప్రిల్ 23 (వెలుతురు):** ప్రాథమిక పాఠశాల కొండకల్ తాండలో చదువుకుంటున్న విద్యార్థులకు, మరియు అంగన్వాడిలో ఉండే పిల్లలకు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుండి నేటి వరకు క్రమం తప్పకుండా కొండకల్ గ్రామ పంచాయతీ పరిధిలోగల ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం పిల్లలలో నీరసాన్ని తగ్గించి, చదువు, మరియు ఆటలపట్ల చురుకుగా, హుషారుగా ఉండేందుకు గాను రోజుకో వెరైటీ వంటకాలైనా టమాటాబాత్, వెజిటేబుల్ బిర్యాని, పులిహోర, ఉప్మా, కిచిడి, లాంటి అల్పాహారాన్ని స్నాక్స్ రూపంలో అందించి విద్యార్థులు క్రమంగా బడికి రావడానికి కృషి చేసినందుకు గాను ఈరోజు పాఠశాల చివరి పని దినమున పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, మరియు ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు సమాజంలోని అవసరం గల వ్యక్తులకు గాని, విద్య సంస్థలకు గాని తమ వంతు కృషిగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా తమ దాతృత్వాన్ని చాటినట్లయితే అది సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందని,




తద్వారా భవిష్యత్తులో నాణ్యమైనటువంటి మానవ వనరులను తయారు చేయుటకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఎంతగానో దోహదపడుతుందని, ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలను శంకర్పల్లి మండల పరిధిలో గల నిర్మాణ, మరియు నిర్మానేతల సంస్థలన్నీ చేపట్టాలని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

### మహారాజపేట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

# సురేందర్ రెడ్డి పదవీ విరమణ అభినందన సభ

### పాల్గొన్న జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు

**శంకర్ పల్లి ఏప్రిల్ 23 (వెలుతురు) :** రేసు సత్తి రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహరాజ్ పేట్ ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్ని వారి భావి జీవితం ఆయు, ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, సురేందర్ రెడ్డి పాఠశాలకు, మండలానికి చేసిన సేవలు కొనియాడారు. జడ్ పి హెచ్ ఎస్ మరియు ఎం పి పి ఎస్ ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, ఎండి. తాహెర్ అలీ, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, జడ్ పి హెచ్ ఎస్ పర్వేద ప్రధానోపాధ్యాయులు డి.సిద్దేశ్వర్, ఉపాధ్యాయ బృందం సురేందర్ రెడ్డిని ఘనంగా పూలమాలల తో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో టి యు టి ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డి. మల్లా రెడ్డి, టి యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రఘునందన్ రెడ్డి, టి టి సి రాష్ట్ర అధ్యక్షులు పి. ఆశీర్వాదం పాల్గొని ఉద్యోగ విరమణ ఉద్యోగి జీవితంలో సాదరణమని, 39 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది పేద విద్యార్థుల ఉన్నత స్థాయికి తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ జి హెచ్ ఎం ఎ బాద్యులు గిరిధర్, కృష్ణయ్య, వెంకటయ్య, జయసింహ రెడ్డి గారు పి అర్ టి యు బాద్యులు గోవర్ధన్ యాదవ్, మహేందర్ రెడ్డి, టి యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు డేవిడ్, టి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు అశోక్, శంకర్ పల్లి పి ఆర్ టి యు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, రాములు, టి యు టి ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్ చారి, ఎస్ టి యు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తపస్ సుమతి లత, కృష్ణ, రియాజ్, రవీందర్ రెడ్డి, జడ్ పి హెచ్ ఎస్ పర్వేద పాఠశాల ఉపాద్యాయులు, శ్రీధర్ రెడ్డి, రాజు,రాజేందర్,



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, శ్రీను, టి ఎస్ యు టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, టి ఎస్ సి పి ఎస్ యు ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, జడ్ పి హెచ్ ఎస్,పి ఎస్ మహరాజ్ పేట్ ఉపాధ్యాయులు సరిత, సంగీత, పుష్పాలత, రాజేందర్ రెడ్డి, అశోక్, కవిత,కాంచన లక్షిమీ, పల్లవి, ధనలక్ష్మి, దేవేందర్ రెడ్డి, మొగులయ్య, ఎం. వెంకరేశ్వర్ రావు, బాలాజీ, మండలంలోని వివిధ పాటశాలల, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ్ జిల్లా జనరల్ సెక్రెటరీగా నియమితులైన కృష్ణారెడ్డి

**జహీరాబాద్ ఏప్రిల్ 23, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పురపాలక సంఘ పరిధిలో గల 65 నంబర్ జాతీయ రహదారి పక్కన గల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సూచన మేరకు జిల్లా మోర్చ్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డికి కిసాన్ మోర్చ్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్బంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాపై నమ్మకంతో కిసాన్ మోర్చ్ జిల్లా జనరల్ సెక్రెటరీగా బాధ్యతలు ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డికి భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ కు, ప్రబారి గంగిరెడ్డి కు, పైడి ఎల్లారెడ్డి కు అసెంబ్లీ కన్వీనర్ జనార్దన్ రెడ్డి లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ గా బి బి పాటిల్ మూడోసారి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయల్లో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

**జహీరాబాద్, 23 ఏప్రిల్, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలల్లోని పలు గ్రామాలలో, జహీరాబాద్ పట్టణంలోని అయా ప్రాంతలో బుధవారం హనుమాన్ జయంతి భక్తులు ఘనంగా జరుపుకున్నారు. హనుమాన్ జయంతి సందర్బంగా జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలని



హనుమాన్ దేవలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 5.30 గంటల నుండి అభిషేకాలు, అర్చనాలు నిర్వహించారు. 6.30 గంటలకు హనుమాన్ ఆలయం నుండి శాంతినగర్ కాలనిలోని ప్రదాన రహదారుల గుండా ప్రభాత్ బేరి యాత్రను నిర్వహించారు. 7.30 గంటలకు ద్వజరోహణ, 8.00 గంటలకు హనుమాన్ డోలరోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆనంతరం భజనలు, వివిధ భక్తి గీతా ఆలపాన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతల నుండి ఆలయనికి దైవదర్శనలకు వచ్చిన భక్తుల సౌకర్యర్థం ఆలయ కమిటీ ఆద్వర్యంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో సాధారణ భక్తుడిలా కూర్చున్న వానరం

**జహీరాబాద్, 23 ఏప్రిల్, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని పట్టణంలోని దత్తగిరి కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకల్లో వానరం భక్తులను తన్మయానికి గురిచేసింది. పట్టణంలోని దత్తగిరి కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయంలో జయంతి వేడుకలు నిర్వహిస్తుండగా సాధారణ భక్తుడిలా జనం మధ్య వచ్చి కూర్చుండిపోయింది. హనుమాన్ జయంతి వేళ వానరం ఆలయ ప్రవేశం చేయడంతో సాక్షాత్తు ఆంజనేయస్వామి దిగి వచ్చారని



భక్తులు తన్మయానికి గురయ్యారు.హనుమాన్ జయంతి ప్రత్యేక పూజలు నిర్వహించినంత సేపు ఆలయంలోనే వానరం ఉండిపోవడం విశేషం. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు వానరానికి అరటి పండ్లు, ప్రసాదాలు అందిస్తూ మొక్కుకున్నారు. పంచముఖి హనుమాన్ ఆలయంలో వానరం ప్రవేశం విషయం తెలుసుకున్న పట్టణంలోని వివిధ ఆలయాల భక్తులు భారీగా తరలివచ్చి వానరుని దర్శించుకున్నారు.

## ఘనంగా అంగన్వాడి వార్షికోత్సవ వేడుకలు

**వెలుతురు న్యూస్ రామన్నపేట:** మండల కేంద్రంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో అంగన్వాడి 1, 2 కేంద్రాలలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాల్యంలో చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారం గురించి అంగన్వాడి టీచర్ బోయపల్లి సత్యవతి, మోటే ప్రతిభ వివరించారు. అలాగే విద్యార్థులకు ఫ్రీ స్కూల్ అసైన్మెంట్ అంశాలపై అవగాహన




కల్పించారు. తల్లితండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని అంగన్వాడి కేంద్రాలు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు ఆయమ్మలు గర్భవతులు మరియు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.






సీజ్ చేసిన జెసిబి, నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్

## అలంఖాన్ గూడ గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

**జెసిబిని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు**

**అక్రమ మట్టి తవ్వకం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ బేస్మెంట్ నింపడానికే**

**మరి ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అనుమతి ఉందా?**

**నాకు ఎలాంటి అనుమతి పత్రం చూపలేదు: గ్రామ కార్యదర్శి**

**శంకర్పల్లి ఏప్రిల్ 23 (వెలుతురు):** శంకర్పల్లి మండలం మహాలింగపురం రెవెన్యూ పరిధిలోని ఆలంఖాన్ గూడ గ్రామంలో సర్వే నెంబర్ 423 లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి అక్రమ మట్టి తవ్వకాలలో ఉపయోగిస్తున్న జెసిబి (నెంబర్ టిఎస్ 35 జి 1462) ను సీజ్ చేయడం జరిగింది. ఈ అక్రమ మట్టి తోవ్వకం ఎందుకు జరిగాయని పరిశీలనలోకి వెళితే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన పొలంలో నూతన ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నందున అందులో బేస్మెంట్ లోపలికి మట్టి అవసరమై ఈ తవ్వకాలు జరిగాయని అక్కడ పనిచేస్తున్న వ్యక్తులు తెలపడం జరిగింది. ఇది ఎవరికి సంబంధించింది అని అడగగా వారు సమాధానం చెప్పలేక పోయారు. వ్యవసాయ భూమిలో నిర్మాణ పనులు చేపడు తున్నప్పుడు నిర్మాణము చేపట్టే భూ విస్తీర్ణానికి నాలా కన్వర్షన్ చేయించుకోవాల్సింది, కానీ సంబంధిత వ్యక్తి నాలా కన్వెన్షన్ చేయకుండా నిర్మాణాన్ని చేపడుతున్నారని అనుమానం వ్యక్తం అవుతుంది. ఈ విధంగా నాలా కన్వెన్షన్ లేకుండా నిర్మాణాన్ని చేపట్టడం మరియు అక్రమంగా మట్టి తవ్వకం చట్టరీత్యా నేరమని తెలిసిన నన్ను ఎవరు ఏ అధికారి ఏమీ చేయలేదని ధీమాతో ఉన్నాడని గ్రామ ప్రజలు గుసగుసలాడుతున్నారు.

ఇకనైనా అధికారులు మేల్కొని ఇలాంటి అక్రమ నిర్మాణాలను, అక్రమ మట్టి తవ్వకాలను ఆపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ అక్రమ మట్టి తవ్వకం విషయంలో మండల తహసిల్దార్ ను వివరణ కోరగా అలంఖాన్ గూడ గ్రామంలో అక్రమమట్టి తవ్వకాలు జరుగుతున్నాయని జెసిబి ని సీజ్ చేయడం జరిగింది. ఇకపై ఎవరైనా సరే ఇంతటివారినైనా ఇలాంటి అక్రమ తవ్వకాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము అని అన్నారు. తాసిల్దార్ జెసిబి ని సీజ్ చేయడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు

ఇక ఫంక్షన్ హాల్ నిర్మాణ విషయంలో గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా ఫంక్షన్ హాల్ నిర్మాణ అనుమతి కోసం నా దగ్గరికి వచ్చారని ముందుగా నాలా కన్వెన్షన్ చేసుకుంటేనే అనుమతి లభిస్తుందని దానికి వారు హెచ్ఎండిఏ నుండి అనుమతి తీసుకువస్తామని వెళ్లారు కానీ దానికి సంబంధించిన ఎటువంటి పత్రాలు నాకు సమర్పించలేదు అని చెప్పారు.

## జోరుగా నడుస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం

**నవాబ్ పేట్ మండలం లోని ముబారక్ పూర్ గంగ్యాడ గ్రామంలోగుబ్బడి పతేపూర్ గ్రామాలలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం..**

**చేవెళ్ల ఎంపి అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి...**

**నవాబుపెట్ మండల్ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య..**

**నవాబు పేట్ (వెలుతురు న్యూస్):**
నవబుపేట్ మండల్ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకి అండగా ఉండే ప్రభుత్వం అన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా మన గ్రామాలు బాగు చేసుకోవడానికి మనమంతా అభివృద్ధిలో జీవించడానికి ఎల్లప్పుడూ తోడుగా ఉండేదే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. మీ అందరి ఆశీర్వాదముతో దైవాశీసులతో రంజిత్ రెడ్డిని పార్లమెంటుకు పంపి తెలంగాణ రాష్ట్రంలో ఎన్నిక ఒక నిదర్శనంగా ఉండే విధంగా మీ అందరి దీవెనలు కావా లన్నారు.

అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల సందర్బంగా కాంగ్రెస్ పార్టీ నవాబుపేటమండలం లోని ముబారక్ పూర్, గంగ్యాడ, గుబ్బడి పతేపూర్ గడప గడపకు తిరిగి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని అయన తెలిపారు



ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు ప్రభావతిఆనందం,వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి,కొండల్ యాదవ్,ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,సంజీవ్ రెడ్డి, శివ ప్రసాద్,కిసాన్ సెల్ అధ్యక్షులు గుండాల శ్రీనివాస్ రెడ్డి,ఎంపీటీసీ ఏగ్బాల్,మాజీ సర్పంచులు బొబ్బిలిగామ శ్రీనివాస్ గౌడ్,మాజీ ఉప సర్పంచ్ సంగారెడ్డి,గోపాలకృష్ణ,ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ,కడిచర్ల, గేట్ వనంపల్లి గ్రామ అధ్యక్షులు మల్కయ్య,ప్రసాద్,సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, వేమారెడ్డి,ఆనందం,వెంకటయ్య, మణేయ్య, రవీందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి,గోపాల్, నరేందర్, మల్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్, నాగభూషణం, ఎల్లయ్య, పర్మయ్య, మహిళా నాయకులు బాలమణి, నాగమణి,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పీజేఆర్ హయంలోనే కూకట్పల్లి అభివృద్ధి..

**సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు పిజేఆర్ తనయ విజయా రెడ్డి**

**కూకట్పల్లి, వెలుతురు:**
పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్పల్లి నియోజకవర్గం కె.పి.హెచ్.బి. కాలనీలో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ తో కలిసి మంగళవారం ప్రచారం చేశారు. ఆసియాలోని అతిపెద్ద కాలనీగా పేరుగాంచిన కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో 1వ రోడ్డు నుంచి 5వ రోడ్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అనూష స్పందన లభించింది. ఒకవైపు మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి మరోవైపు దివంగత నేత పీజేఆర్ కుమార్తె విజయ రెడ్డిలు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలలో ఐదు గ్యారంటీలు అమలు చేస్తుందని తెలిపారు. మహిళా సమస్యలను పరిష్కరించే ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేసే ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందని త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి



గెలిపించాలని ఈ సందర్భంగా సునీత మహేందర్ రెడ్డి కోరారు. పీజేఆర్ కుమార్తె సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు విజయా రెడ్డి మాట్లాడుతూ గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్న కూకట్పల్లి నియోజకవర్గంగా అవతరించిం దన్నారు. పీజేఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాల హాయంలో ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సునీత మహేందర్ రెడ్డిని భారీ ఆదికెంతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న టీపిసిసి సత్యం శ్రీరంగం, కూకట్ పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, అధ్యక్షులు తూము వేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రతాపరెడ్డి, బషీర్, మోయిస్, సంజీవరావు, మేకల మైకేల్, సునీల్ యాదవ్, గొట్టిముక్కల దేశాలు, మక్కల వెంకట్, భీమ్ రావు, ప్రవీణ్ ,అరవింద్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, మారుతి, అప్పారావు, రేష్మ, సంధ్యారాణి, మనీ, వాణి తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు

**రాజేంద్రనగర్ (వెలుతురు):** శోభాయాత్రలతో భారతదేశంలో సంస్కృతీ, సాంప్రదాయాలు పెంపొందడంతో పాటూ దేశ భక్తి కూడా పెరుగుతుందని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి. అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.హనుమాన్ జయంతి పండుగ పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీ, ఆదర్శ కాలనీ,శ్రీరామ్ నగర్ లో శ్రీ హనుమాన్ దేవాలయంలో జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకలలో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.అనంతరం హనుమాన్ విగ్రహ శోభయాత్ర నిర్వహించారు.హిందూ సోదరులు ప్రధాన రహదారుల వెంబడి డీజీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తూ ప్రత్యేక పాటలపై డ్యాన్సులు నిర్వహించారు.అనంతరం హిందూ సోదరులతో కలిసి డాన్స్ చేశారు. జై హనుమాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఘనంగా శోభయాత్ర చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.యువతలో భక్తి భావం పెరగడం దేశ ఐక్యతకు చిహ్నామని ఆయన చెప్పారు.15 ఏళ్లుగా శంషాబాద్ లో శోభాయాత్ర నిర్వహిస్తున్న స్థానిక యువకులను



కొండా విశ్వేశ్వర్ రెడ్డి అభినందించారు.అయితే ఓ వైపు యువకుల్లో భక్తి భావం పెరుగుతుండగా.. కొందరు దుర్మార్గులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం హనుమాన్ గుడిని కూల్చి వేయడాన్ని ఆయన తప్పుపట్టారు.హనుమాన్ ఆశీస్సులతో ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.హిందూ ధర్మ పరిరక్షణ కోసం యువకులంతా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు.మోడీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సమైక్య భావంతో కలిసి జీవిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను కొండా విశ్వేశ్వర్ రెడ్డి అభినందించారు.హిందూ ధర్మ పరి రక్షణకు సాంస్కృతిక వికాసానికి శోభాయాత్ర లాంటి కార్యక్రమాలు ఎంతో దహనం చేస్తాయని ఆయన చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఈ శోభ యాత్రలో రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ ,డాక్టర్ ప్రేమ్ రాజ్, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్,రాజేందర్ రెడ్డి,పొలం ప్రదీప్ కళ్యాణ్ రెడ్డి,జగ్గారెడ్డి, సుభాష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,పాండు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం

## కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

**కూకట్‌పల్లి, వెలుతురు:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ డివిజన్ రోడ్డు నెంబర్ వన్ లోని గాంధీ విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభించి గడప గడపకు తిరుగుతూ విస్తృత పాదయాత్ర కార్యక్రమం నిర్వహించిన మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జి విజయారెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పేదల సంక్షేమానికి ఇచ్చిన ఆరు గ్యారంటీలలో అధికారంలోకి రాగానే ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేసిందని, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలంటే అది కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పేద మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, శేరి సతీష్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, సంజీవ రెడ్డి, ఫణి కుమార్, అరవింద రెడ్డి, గొట్టిముక్కల దేశాల్, యూత్ కాంగ్రెస్ నాయకులు సద్దాం మొయిజ్, కెపిహెచ్ బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కలికోట బాలరాజు, మహిళా డివిజన్ అధ్యక్షులు మారుతీ, జోజమ్మ, రేష్మ, వాణి, మణి, సంధ్య, అంజి రెడ్డి, పవన్, జిబిన్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవినీతి రహిత పాలన బిజెపి లక్ష్యం..

## కంటెస్టెంట్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్..

**శేర్లింగంపల్లి వెలుతురు:** చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ మొగులమ్మ బస్తి, పీజేఆర్ నగర్, గణేష్ నగర్, సుభాష్, చంద్రబోస్ నగర్, సిక్కుల బస్తి, అంబేద్కర్ నగర్, జన్మభూమి కాలని, మహాత్మా గాంధీ నగర్ కాలనీలలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రవీందర్రావు, మణి భూషణ్, నరేందర్ రెడ్డి, రామరాజు, కమలాకర్ రెడ్డి నర్సింగ్ యాదవ్, నరసింహా చారి, కుమార్ యాదవ్ , కేశవ్, స్రవంతి తో కలసి రవికుమార్ యాదవ్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంటులో భారతీయ జనతా పార్టీకి అత్యధిక మెజార్టీ ఓట్లు రావడం తథ్యం శేర్లింగంపల్లి నియోజకవర్గంలో కూడా అత్యధికంగా భారతీయ జనతా పార్టీకి ఓట్లు వస్తాయని సర్వేల ఆధారంగా తెలుస్తుందన్నారు.

ఇప్పుడు ఉన్నటువంటి పార్లమెంటు సభ్యులు రంజిత్ రెడ్డి గతంలో బిఆర్ఎస్ పార్టీలో ఉండి ఒరగబెట్టింది ఏమీ లేదని ఇప్పుడు కొత్తగా గెలిపిస్తే ఏం చేస్తాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు స్కాములు, స్కీములు తప్ప ప్రజలన్నా, అభివృద్ధి అన్న పట్టదు అన్నారు. తప్పకుండా భారతీయ జనతా పార్టీ గెలవగానే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎంపీ కోటలో పెద్ద ఎత్తున నిధులు రాబట్టుకొని అన్ని ప్రాంతాలలో అభివృద్ధికి పాల్పడతామని తప్పకుండా కొండా



విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించి మన సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుందామని కోరుతూ గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మాత్రం మోడీ రావాలనే నినాదంతో అందరూ ముక్తకంఠంతో బిజెపి పార్టీకి ఓటు వేసి మోడీ ప్రభుత్వాన్ని మళ్ళీ తీసుకొచ్చి అవినీతి రహిత పాలన అందించి అభివృద్ధి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ రావు, రామ్ రెడ్డి, సీతారామరాజు శ్రీనివాస్, మోహన్ రెడ్డి, రఘు, రమేష్, సురేష్ చాంద్, రాయల్, కృష్ణంరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సందీప్ గౌడ్, రాజు, అమరేందర్ అనూష, సైదమ్మ ,అనిత పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయలో పడి మరోసారి మోసపోవొద్దు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**రాజేంద్రనగర్ (వెలుతురు):** సామాన్యుడిని ప్రధాని నరేంద్ర మోదీ నిలువునా మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి ర్యాలీగా తరలి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం నిర్వహించిన రోడ్ షో కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ ,శేర్ లింగంపల్లి ఎమ్మెల్యేలు టి.ప్రకాష్ గౌడ్,గాంధీ తో కలిసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మోసం పార్ట్-1 నడిచింది...పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోసం పార్ట్-2 సీక్వెల్ నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.పంద్రాగస్టులోగా రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసానికి యత్నిస్తుందని ఆయన తెలిపారు.తెలంగాణలో 17 ఎంపీ స్థానాలకు గానూ 12 స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.ఈ ఎన్నికల్లో ఎన్డీయేకు 220 సీట్లు,యూపీఏ 150 సీట్లు దాటే పరిస్థితి లేదు.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి 12 సీట్లు కట్టబెడితే..అటు ఎన్డీఏ,ఇటు యూపీఏ ఇద్దరూ కేసీఆర్ వద్దకు వచ్చి దండం పెడుతారు.తెలంగాణకు ఏం కావాలంటే అది చేస్తాం..మాకు మద్దతివ్వండి అనే పరిస్థితి వస్తుంది.కాబట్టి ఈ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు గట్టిగా పోరాడి మెజార్టీ స్థానాల్లో గెలిచే ప్రయత్నం చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

### పార్టీ నుంచి పిరికిపందల్లా జారుకున్నారు..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రంజిత్ రెడ్డి ఎంపీగా,పట్నం మహేందర్ రెడ్డి మంత్రిగా పదవులు అనుభవించిన వారు తల్లి లాంటి పార్టీకి మోసం చేశారు.ఈ ఎన్నికల్లో రంజిత్



రెడ్డి,పట్నం మహేందర్ రెడ్డి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది..అధికారం పోగానే పార్టీ నుంచి పిరికిపందల్లా జారుకున్నారు.93 కులాలను ఐక్యం చేసిన బాహుబలి కాసాని జ్ఞానేశ్వర్.ఒక బలమైన నాయకుడు బలహీన వర్గాలకు గొంతుకై నిలబడ్డాడు.అలాంటి కాసానిని గెలిపించాలి. బలహీన వర్గాలకు రాజ్యాధికారం కావాలంటే కాసానిని గెలిపించి బీసీల సత్తా చూపించాలన్నారు కేటీఆర్.

### మళ్లీ మోసపోదామా..?

అరచేతిలో వైకుంఠం చూపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను ప్రజలకు గుర్తు చేయాలి.. రుణమాఫీ ,రైతుబంధు వంటి అంశాలను గుర్తు చేయాలి..అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ.అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మోసం పార్ట్-1 నడిచింది..పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోసం పార్ట్-2 సీక్వెల్ నడుస్తోంది. రైతు రుణమాఫీ పంద్రాగస్టు లోపు చేస్తామంటున్నారు.మళ్లీ మోసపోదామా..? ఒకసారి మోసపోయింది చాలదా..? ఒక్కసారి మోసపోతే మోసం చేసినోనిది తప్పు అయితది. రెండోసారి మోసపోతే ఎవడైతే నమ్మిండో వారిది తప్పు అయితదని కేటీఆర్ పేర్కొన్నారు.ప్రజలు ఒకసారి మోసపోతే నాయకుల తప్పు అవుతోందని,రెండోసారి కూడా మోసపోతే అది కచ్చితంగా ప్రజల తప్పే అవుతుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ మరోసారి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.అసెంబ్లీ ఎన్నికల్లోనూ అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని తెలిపారు.ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను గ్రహించి బీసీలు,ఎస్సీలు,ఎస్టీలు ఏకమై కాసానిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన హస్తం పార్టీ ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని మరోసారి మోసానికి యత్నిస్తోందని ఆరోపించారు.మతమే ఎజెండాగా రాష్ట్రంలో కాషాయ పార్టీ రాజకీయాలు చేస్తోందని ఫైర్ అయ్యారు.కుటిల రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో సరైన బుద్ధి చెప్పాలన్నారు.ఆ పార్టీని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉన్నాయని అన్నారు.బలహీనవర్గాల బలమైన గొంతుక కాసానిని చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# కోహిర్ మండలంలో బిఆర్ఎస్ ఎంపీ ఎన్నికల ప్రచారం

## బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది

## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నియు విస్మరించింది

## కొనింటి మాణిక్ రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే

**జహీరాబాద్, 23 ఏప్రిల్, వెలుతురు :** ఉద్యమకారుడైన బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ను గెలిపిస్తే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, జహీరాబాద్ ఎమ్మెల్యే కె. మాణిక్ రావు అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహిర్ మండలంలోని గొట్టిగర్ పల్లి, పర్శపల్లి, సజ్జపూర్, ఖానాపూర్, కొత్తూర్ గ్రామాల్లో పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ తరపున పార్టీ సమన్వయకర్త దేవీప్రసాద్ లతో కలిసి ముమ్మర ప్రచారం చేసి అనంతరం మండల నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు యాదవ్, కోహిర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మ్యాథరి ఆనంద్ లతో కలిసి పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. వారికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, 24 గంటలు విద్యుత్ సరఫరా చేసిందని, వృద్దులు, వితంతువుల కోసం ఆసరా పెన్షన్ అమలు చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దీనిని విస్మరిస్తుందని మండిపడుతూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనిల్ కుమార్ విజయం కోసం ప్రతి ఒక్కరు కంకణం కట్టుకొని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిచారేగడి సహకార బ్యాంక్ చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు నర్సింలు యాదవ్, మండల సీనియర్ నాయకులు మ్యాథరి ఆనంద్, మాజీ మార్కెట్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, మాజీ సర్పంచులు శకుంతల తుకప్ప, బంటు రామకృష్ణ, నర్సింలు, రమేష్, సిద్ధప్ప, సయ్యద్ అత్తర్ అలీ, ఖానాపూర్ అధ్యక్షుడు నర్సింలు, సీనియర్ నాయకులు



పట్వారీ రాములు, అక్షయ్ దేశ్పాండే, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి పురస్కరించుకొని కొండాపూర్ సంగ్రామ్ మహారాజ్ దర్శనం చేసుకున్న కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ

**వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 23:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం వెంకటపూర్ గ్రామముకు చెందిన నారాయణఖేడ్ నియోజకవర్గం కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మలిగొండ హనుమాన్ జయంతి పురస్కరించుకొని కొండాపూర్ సంగ్రామ్ మహారాజు దర్శనం చేసుకున్నారు వారితోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ విజయ సంకల్ప నామినేషన్ ర్యాలీ

**వెలుతురు న్యూస్, రామన్నపేట:** భారతీయ జనతా పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బుర్ర నర్సయ్య గౌడ్ నామినేషన్ కొరకై భువనగిరి పట్టణానికి బయలుదేరిన కోమ్మయగూడెం బిజెపి శ్రేణులు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ మధుకర్ రెడ్డి గ్రామ అధ్యక్షుడు గోపగోని అశోక్ గౌడ్, శక్తి కేంద్ర ఇన్చార్జ్ వీరమల్ల వీరేష్ గౌడ్, బిజెపి నాయకులు బెల్లి లింగస్వామి, సింగు శంకర్ రెడ్డి, పోల్కంపల్లి వెంకన్న, శివ, రేపాక లింగస్వామి, ఐలాపురం అశోక్, మహేందర్ రెడ్డి, మచ్చ మహేష్, మచ్చ సింహాద్రి, నాగరాజు, గణేషు తదితరులు బిజెపి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



# హనుమాన్ జయంతి విజయోత్సవ ర్యాలీ

**వెలుతురు న్యూస్, రామన్నపేట:** హనుమాన్ జయంతి సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన హనుమాన్ భక్తులు రామన్నపేట పట్టణంలో హనుమాన్ గుడి వద్ద చేరుకొని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించి. తదినంతరం భక్తులు అందరూ కలిసి వివిధ వాడల్లో హనుమాన్ శ్లోకాలతో ర్యాలీని




ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ప్రఖండ సహాయ కార్యదర్శి కైరంకొండ సంతోష్ కుమార్, విహెచ్పి యాదాద్రి జిల్లా సహాయ కార్యదర్శి గడిశెట్టి శేఖర్, రామన్నపేట ప్రఖండ అధ్యక్షులు నోముల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు పాండు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి నకరికంటి మొగులయ్య,జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, మండల అధ్యక్షులు వల్లపు దుర్గయ్య, వీరమల్ల రమేష్, మచ్చ నరేష్, బాత్క సైదులు, ఎర్ర కిరణ్ హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా డి. స్రవంతి రెడ్డి నియామకం

**బొల్లారం వెలుతురు ఏప్రిల్ 23:**

బొల్లారం మున్సిపల్ మాజీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డి.స్రవంతి రెడ్డిని సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకురాలు హైదరాబాద్ మహిళా మోర్చా పార్లమెంట్ కన్వినర్, మెదక్ మహిళా మోర్చా ఇంచార్జి దశరథ లక్ష్మి, సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధురి ఆనంద్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా డి.స్రవంతి రెడ్డిని ఎన్నుకున్నట్టు నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని



అందుకున్న తరువాత డి. స్రవంతి రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాపై నమ్మకముంచి పార్టీ భాద్యతలు అప్పగించినందుకు జిల్లా ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తన పదవికి శక్తివంచన లేకుండా పనిచేసి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతనని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి టీ. మేఘన రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆదర్శ రైతుకు పడితపల్లి మల్లేశంకు సన్మానం

**గంగాధర మండలం వెలుతురు ఏప్రిల్ 23:** గంగాధర మండలం మల్లాపూర్ కి చెందిన ఆదర్శ రైతు అవార్డు గ్రహీత పడితపల్లి మల్లేశంను బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి సన్మానించి అభినందించారు.సాటి రైతులకు సాగు మెలుకువలు నేర్పించాలని రసాయన రహిత వ్యవసాయం విస్తృత పరచాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.






# "భూమిని కాపాడుకుందాం - ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం"

**- డాక్టర్ బండి సాయన్న, అధ్యక్షుడు, స్కోప్ సంస్థ**

**సంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 23:**
ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) ఆధ్వర్యంలో పెద్దగోపులారం విలెజ్ మునిపల్లి మండలం, మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల పాఠశాల సంగారెడ్డి జిల్లా ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.

ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ క్రింద ఉదాహరించిన అంశాలతో పాటు పుడమిని రక్షించుకుంటేనే సమస్త జీవకోటికి రక్షణ అని తెలుపుతూ...

1. ప్లాస్టిక్ వస్తువులు ఒకసారి వాడి భూమిమీద పారవేయడం, ఆ వస్తువులు కరిగిపోవడానికి 1000 సంవత్సరాల టైం పడుతుంది తద్వారా భూమి మీద మరియు లోపల అనేకంగా దాగి ఉన్న సహజ వనరులు పూర్తిగా కలుషితమై అనేక రకములైన వ్యాధులు సంబవించడానికి మూల కారణం అవుతున్నాయి. ఇందులో భాగంగా భూమిలో నీరు ఇంక కుండా ఈ యొక్క ప్లాస్టిక్ పదార్థాలు ప్రయత్నం చేస్తున్నాయి. ఈ భూమి మీద ప్లాస్టిక్ వస్తువులు పడవేసినప్పుడు చెరువులు, కుంటల, నదులు మరియు సముద్రాలు కలుషితము కావడం చేత ఈ నది జలలపై ఆధారపడి జీవించే అనేక జీవులు, సూక్ష్మ జీవులు మరణించడం జరుగుతుంది.
2. ఈ యొక్క కలుషితమైన వస్తువులు వాడడం మూలంగా క్యాన్సర్ రోగం అతి భయంకరంగా ప్రబలుతుంది. ఇది సమస్త మానవ మనగడకే ప్రమాదకరంగా తయారయింది.
3. మెదడులోని టిష్యూలు చిన్నవి కావడం చేత అవి మరికొంత కాలానికి పూర్తిగా నశించి మెదడుకు సంబంధించిన అనేక జబ్బులు రావడానికి అవకాశం ఉంది.
4. భూసారము తగ్గడం మూలంగా పంటలు దిగుబడి తగ్గి ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది.
5. వర్షాకాలంలో ఈ యొక్క ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు మురికి కాల్వలను మూసి వేయడం మూలంగా రోడ్ల వెంబడి మురికి నీరు ప్రవహించడం ములంగా అనేక వ్యాధులు సంబంవించి అనేక మానవుల ఆర్థిక మరియు ఆరోగ్య స్థాయిలను దిగజార్చుతున్నాయి.
6. ప్లాస్టిక్ వస్తువులను అధికంగా వాడడం మూలంగా పుట్టుకలో లోపాలు మరియు రోగ నిరోధక శక్తి తగ్గి అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయి.
7. ప్లాస్టిక్ భూమిలో కరగ టానికి వందల వేల సంవత్సరాలు పాట్టడం మూలంగా దీర్ఘకాలిక పర్యావరణానికి నష్టం కలగజేస్తుంది. తద్వారా చిన్న జీవి నుంచి తిమింగలాల ఆహార గొలుసులను ప్రభావితం చేస్తుంది.

పైన ఉదాహరించిన అంశాలే కాకుండా సమస్త భుజంతులకును మరియు మానవాళికి సంబంధించిన ప్రగతికి ఈ ప్లాస్టిక్ భూతం అడ్డుపడుతుంది. కాబట్టి ప్రతి మానవుడు ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి భవిష్యత్తు మనుగడకు దోహద పడాలని డాక్టర్ బండి సాయన్న గారు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలియజేశారు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరినాధ రావు గారు మాట్లాడుతూ ప్లాస్టిక్ అన్నది మన భూమిని కలుషితం చేసే దాంట్లో మొదటి భాగం కాబట్టి ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్లాట్ పడాలని అన్నారు. మన గ్రామాలలో ప్లాస్టిక్ ను ఎంకరేజ్ చేసే వాళ్ళు రాక్షసులు ప్లాస్టిక్ నిరోధించేవాళ్లు దేవతలు అని చక్కటి స్లొగన్స్ ఇవ్వడం జరిగింది. స్కోప్ చైర్మన్ డాక్టర్ సాయన్నగారు మాట్లాడుతూ మనం గ్రామాలలో ముఖ్యంగా ప్లాస్టిక్ అన్నది నిత్యంగా ఒక వస్తువుగా వాడుతున్నారు. అలాంటి ప్లాస్టిక్ వల్ల భూమి అన్నది కలుషితం అవుతున్నది. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్కు నిరోధించి మన భూమిని కాపాడాలి అని చెప్పడం జరిగింది. పిల్లలు ముఖ్యంగా వారి యొక్క భవిష్యత్తు తరాలకు భూమిని కాపాడాలంటే మనందరం ప్లాస్టిక్ నిషేధించాలి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన వ్యాసరచన పోటీలలో పిల్లలు చురుకుగా పాల్గొని జిల్లా వ్యాప్తంగా 463 మంది ఈ వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు.

ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో ప్రథమ బహుమతి ఏ దివ్య టి ఎస్ మోడల్ హైస్కూల్ బొల్లారం, రెండవ బహుమతి జే నందకిషోర్, కిషోర్ చందన స్ఫూర్తి చరణ్ సాయి సూచన అండ్ స్ఫూర్తి వీరికి బహుమతులు రావడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దశరథ పెద్ద గోపులారం హెడ్మాస్టర్ భాస్కర్ డిసిపియు రత్నం, సఖి సెంటర్ కల్పన, శ్రీధర్ , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ ఉప్పలయ్య, స్కోప్ స్వచ్ఛంద సంస్థ స్టాప్ మానయ్య, దశరథ, ఎల్లయ్య, సవిత, రామ గౌడ్, సావిత్రి, టీచర్స్, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, మాదా సైదులు మరియు ఎంపీటీసీ పాండు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు మరియు పుర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని పెద్ద గోపులారం గ్రామంలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేదిస్తామని ప్రతిజ్ఞ చేయడం కూడా జరిగింది. ర్యాలీ కూడా తీయడం జరిగింది.

















# అకాల వర్షాలతో రైతులపై దెబ్బ

### భారీగా నష్టపోయిన రైతులు

హైదరాబాద్,ఏప్రిల్23(వెలుతురు): అకాల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలు మరోసారి రైతులను నట్టేట ముంచాయి. చేతికొచ్చిన పంటను నేలపాలు చేశాయి. వడగండ్లు, ఈదురుగాలులతో కురిసిన వానలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కోతకొచ్చిన మక్క, వరి చేన్లు నేలకొరిగి పోగా.. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి. వాన నీటిలో కొట్టుకు పోయాయి. పక్వానికొచ్చిన మామిడి కాయలన్నీ రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నీటిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట్ జిల్లాలో రైతులు భారీగా నష్టపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట అకాల వర్షాలకు ఆగమవుతుండడంతో లబోదిబోమని మొత్తుకుంటున్నారు రైతులు. ఇకపోతే పలుచోట్ల సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయాయి. ఈ సంవత్సరం అకాల వర్షాలకు తోడు నీటి సమస్య కూడా తోడయ్యింది. అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో మంత్రులు జిల్లాల్లో స్వయంగా పరిశీలించారు. త్వరలోనే పంట నష్టాలన్ని లెక్కకట్టి పరిహారం అందచేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. అకాల వర్షాలతో ఎన్నడూ లేని విదంగా పూర్తి పంట నష్టపోయిన ప్రాంతాల్లో బిఆర్ఎస్ నేతలు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించారు. రైతులలో భరోసా నింపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. పలు జిల్లాల్లో వాణిజ్య పంటలు నేలకొరిగాయి.

# ధాన్యానికి పెరుగుతున్న డిమాండ్

### ధాన్యం సేకరణకు పక్కా ప్రణాళిక

నిజామాబాద్,ఏప్రిల్23(వెలుతురు): ఈసారి దేశీయంగా ధాన్యానికి మంచి డిమాండ్ ఉందని భావిస్తున్నారు. దీనికితోడు జిల్లాలో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. మరోవైపు ధాన్యం సేకరణకు ఇప్పటినుంచే పక్కాగా కార్యాచరణ చేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి పెద్దఎత్తున దిగుబడులు వస్తాయన్నారు. సాధారణ సాగుకు మించి వరిసాగును రైతులు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే ఆయా శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు స్పష్టమైన ఆదేశాలు వెళ్ళాయి. రైతులు నష్టపోకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గతంలోనే సిఎం రేవంత్ ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు జిల్లాలో ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు వరికోతలు మొదలుపెట్టడంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేం దుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో



సన్న రకం, దొడ్డురకం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నారు. సాగుచేసిన సన్న రకం ధాన్యాన్ని రైతులు ఎక్కువగా ప్రైవేట్‌కే అమ్ముకు నేందుకు మొగ్గుచూపుతుండగా దొడ్డురకం ధాన్యాన్ని మాత్రం కొనుగోలు కేంద్రాల్లో కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. బోధన్ డివిజన్‌తో పాటు ఆర్మూర్ డివిజన్‌లోని కొన్ని మండలాల్లో సన్నరకాలను రైతులు బయటనే అమ్మే అవకాశం ఉంది. ధాన్యం తరలింపుకోసం జిల్లా వ్యాప్తంగా వాహనాలను అందుబాటులో ఉంచేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఉప్పల్‌లో బైక్ స్కిడ్.. యువకుడుపై నుంచి దూసుకెళ్ళిన బస్సు

### యువకుడు దుర్మరణం

హైదరాబాద్,ఏప్రిల్ 23(వెలుతురు): మేడ్చల్ జిల్లా ఉప్పల్ లో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో చోటుచేసుకుంది. ఉప్పల్ లో బైక్ స్కిడ్ అయి యువకుడు కిందపడిపోయాడు. అతడి పై నుంచి బస్సు దూసుకెళ్లడంతో ఘటనా స్థలంలోనే యువకుడు మృతి చెందాడు. వర్షిత్ రెడ్డి అనే యువకుడు బైక్ పై వెళ్తుండగా కిందపడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న బస్సు అతడి పైనుంచి పోవడంతో తీవ్రంగా గాయపడి వర్షిత్ రెడ్డి చనిపోయాడు. తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని గుండెలు బాదుకొని కన్నీంటిపర్యంతమయ్యారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడని వాపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫ్లైఓవర్ నిర్మాణంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఫ్లైఓవర్ పనులు చేపటి రెండు-మూడు సంవత్సరాలు గడిచిన ఇంకా పనులు పూర్తి కావడంలేదని మండిపడుతున్నారు. ఫైఓవర్ కోసం తీసిన గుంతలతోనే యువకుడి ప్రాణాలు పోయాయని మృతుడి తల్లిదండ్రులు ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఉప్పల్, మేడిపల్లి వాసులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరగా స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# నేటి నుంచి కెసిఆర్ బస్సుయాత్ర

### బస్సుకు తెలంగాణ భవన్‌లో పూజలు

హైదరాబాద్,ఏప్రిల్23(వెలుతురు): బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే బస్సు యాత్ర బుధవారం ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో కేసీఆర్ యాత్ర కొనసాగించబోయే బస్సుకు తెలంగాణ భవన్‌లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో గులాబీ శ్రేణులు పాల్గొన్నారు. బుధవారం 24 నుంచి వరుసగా 17 రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడంతో పార్టీ అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నది. మే నెల 10 వరకు ఈ బస్సు యాత్ర కొనసాగుతుంది.



మిర్యాలగూడలో ప్రారంభమై సిద్దిపేటలో జరిగే బహిరంగసభతో ఈ యాత్ర ముగుస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కేసీఆర్ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. దాదాపు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒకటి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్‌షోలు ఉండే విధంగా బస్సు యాత్రను ప్లాన్ చేశారు. తమ నియోజకవర్గాల్లో కూడా కేసీఆర్ బస్సు యాత్ర చేయాలంటూ వివిధ నియోజకవర్గాల నేతల నుంచి డిమాండ్ వస్తున్నది. అయితే, సమయం తక్కువగా ఉండటం, ఎండ వేడి దృష్ట్యా కొన్ని నియోజకవర్గాల్లోనే బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు.

# కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### మార్నింగ్ వాకర్స్‌ను కలిసి బలరామ్ ప్రచారం

భద్రాచలం,ఏప్రిల్23(వెలుతురు): మానుకోట కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్నింగ్ వాక్‌లో ప్రచారం చేపట్టారు. మంగళవారం ఉదయం భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తూ ప్రచారం చేసారు.

మార్నింగ్ వాకర్స్‌తో సమావేశమైన బలరాం నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు మాజీ గ్రంథాలయ చైర్మన్ బోగాల శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ నాయకులు తోటకూర రవి శంకర్,పట్టణ అధ్యక్షులు పరిమి శ్రీనివాస్,డోర్నకల్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ జూలకంటి సీతారాం రెడ్డి,

బొలిషెట్టి రంగారావు,రాసమల్ల రాము,ఎస్ కె అలీ పాషా,సిద్ది గణెలిష్,బస్వ రాజు తదితరులు పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ, కెసిఆర్ మధ్య చీకటి ఒప్పందం ఉందని విమర్శించారు.

బిఆర్ఎస్ కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టాలని



అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్‌కు మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీని తిరస్కరించాలని పిలుపునిచ్చారు. బిజెపి మతాలు, భాషల మధ్య చిచ్చుపెట్టి నీచ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. రాముడి పేరుతో ఎంతకాలం రాజకీయాలు చేస్తారని విమర్శించారు. కెసిఆర్ అవినీతి, ధరిణితో కొల్లగొట్టిన భూములపై విచారణ కోసం బిజెపి నేతలు ఎందుకు సిబిఐని తీసుకుని రాలేదని నిలదీశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న నరేంద్ర మోడీ నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు తాకట్టు పెట్టారని విమర్శించారు. స్విస్ బ్యాంకులో దాచిన రూ.లక్షల కోట్ల నల్ల ధనాన్ని తెచ్చి జన్‌ధన్ ఖతాల్లో వేస్తానని విస్మరించారని, ఏడాదికి కోటి ఉద్యోగాలు ఏమయ్యాయని అన్నారు. మోడీకి ఓట్లు ఎందుకు వేయాలని అన్నారు. మతం, దేవుడు పేరుతో రాజకీలు చేసే బిజెపిని పొలిమేరల వరకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత తనపై ఉందని అన్నారు. ఎన్నికలు ముగియగానే అర్హులైన ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలతో ఈ ప్రాంతలో ఎంతోమంది పేదలు ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. తాము ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాల రద్దుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.

# బంగారం ధరలతో దడ - వరుసగా వేలల్లో పెరుగుదల

హైదరాబాద్,ఏప్రిల్ 23(వెలుతురు): బంగారం పేరు వింటనేనే దడ పుట్టే పరిస్థితి వచ్చింది. ఆల్‌టైమ్ రికార్డ్‌తో గోల్డ్ ధరలు పరుగులు పెడుతున్నాయి. కేవలం రెండు నెలల్లోనే సుమారు రూ. 15 వేల వరకు బంగారం ధర పెరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిస్థితులు, యుద్ధ వాతావరణ నేపథ్యంలో గోల్డ్ ధరలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాయి. ఇక ఈ ఏడాది చివర నాటికి తులం బంగారం ధర కచ్చితంగా రూ. 80 వేల వరకు చేరుకోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే వరుసగా ప్రతీ రోజూ పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు గత రెండు రోజులుగా బ్రేక్‌లు పడుతున్నాయి. సోమవారం స్వల్పంగా తగ్గి బంగారం ధర మంగళవారం మరోసారి తగ్గుముఖం పట్టింది. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరల్లో బంగారం ధరలో కాస్త తగ్గుదల కనిపించింది. మరి ఈ రోజు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. దేశ రాజధాని న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 67,690కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,830గా ఉంది. ఇక ముంబయిలో 22 క్యారెట్ల ధర రూ. 67,540, 24 క్యారెట్ల ధర రూ. 73,680 వద్ద కొనసాగుతోంది.



అలాగే చెన్నైలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 68,440, 24 క్యారెట్ల ధర రూ. 74,660 వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ. 67,540 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,689 వద్ద కొనసాగుతోంది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే హైదరాబాద్‌లో ఈరోజు 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 67,540కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,689 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడతో పాటు విశాఖపట్నంలోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దిలా ఉంటే వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఈరోజు కిలో వెండిపై రూ. 100 వరకు తగ్గింది. దీంతో ఢిల్లీతో పాటు ముంబయి, కోల్‌కతా, పుణె వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 85,400గా ఉంది.

అలాగే చెన్నై, కేరళ, హైదరాబాద్, విజయావడ, విశాఖపట్నంలో కిలో వెండి ధర అత్యధికంగా రూ. 88,900 వద్ద కొనసాగుతోంది.





# బిఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు

### పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని వినతి

హైదరాబాద్,ఏప్రిల్23(వెలుతురు): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం తెలంగాణలోని పలు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు జోరుగా నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎకస్ నేతలు, తదితరులు ఉన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా ఆత్రం సక్కు రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు అందజేశారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో తెలంగాణ హక్కుల పరిరక్షణకై బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలు బడుగు, బలహీన వర్గాల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ నాయకులు అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ గెలుపుతోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా మాలోతు కవితరెండు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే వచ్చే ప్రయోజనం ఏమి లేదన్నారు. బీఆర్ఎస్ గెలుపుతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గతంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

### భారత్ పే' అనే తొలి ఆల్ ఇన్ వన్

# పేమెంట్ ప్రొడక్ట్‌ను ఆవిష్కరణ

న్యూఢిల్లీ ఏప్రిల్ 23(వెలుతురు): ఫిన్ టెక్ కంపెనీ 'భారత్ పే' అనే తొలి ఆల్ ఇన్ వన్ పేమెంట్ ప్రొడక్ట్ ను ఆవిష్కరించింది. అందులో పాయింట్ ఆఫ్ సేల్(పిఓఎస్), క్యూఆర్, స్పీకర్ వంటివన్నీ సింగిల్ డివైస్ లో ఇన్ కార్పొరేట్ చేశారు. తొలి దశలో ఈ ప్రొడక్ట్ ను 100 నగరాలలో ఆవిష్కరించారు. మరో ఆరు నెలల్లో 450 నగరాలకు దీనిని విస్తరించనున్నారు. 'అనేక ఫంక్షనాలిటీలను కలగలపడం వల్ల ఇదో కాస్ట్ ఎఫెక్టివ్ డివైస్ గా మారింది, చిన్న, మధ్య బిజినెస్ లకు అనుగుణంగా సమగ్ర పరిష్కారాన్ని అందిస్తున్నాం' అని భారత్ పే సిఈవో నళిన్ నేగి ఓ ప్రకటనలో తెలిపారు.




# తెలంగాణలో తేలికపాటి వర్షాలు

హైదరాబాద్,ఏప్రిల్23(వెలుతురు): తెలంగాణలో రాగల రెండురోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, బుధవారం నుంచి వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి గురువారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. గడిచిన 24గంటల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. బుధవారం నుంచి శుక్రవారం వరకు కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది.

# వెలిచాల నామినేషన్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

### పార్టీ ఆదేశాల మేరకే పాల్గొన్నట్లు ప్రకటన

హైదరాబాద్,ఏప్రిల్23(వెలుతురు): కాంగ్రెస్ పార్టీ పెద్దల సూచన మేరకు, పార్టీ నాయకత్వం ఏకగ్రీవంగా వెలిచాల రాజేందర్ నామినేషన్‌లో పాల్గొన్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈరోజు,రేపో పార్టీ అభ్యర్థి అధికారిక ప్రకటన వస్తుందని ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని ఇందిరా భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు, మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణతో కలిసి సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మొదటి దశ ఓటింగ్ ముగిసిన తర్వాత ప్రధాని మోదీ వెన్నులో వణుకు పుడుతోందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఆస్తులు పంచుతుందని మోదీ చెప్పడం బాధాకరమన్నారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అన్ని వర్గాలకు ప్రాతినిథ్యం వహించాల్సిన మోదీ నీచంగా మాట్లాడారని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్య పాలనపై ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని విమర్శించారు. గతంలో మాజీ ప్రధాని మన్మోహ్‌సింగ్ మాట్లాడిన వీడియోను వక్రీకరించి తప్పుడు




ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా పరిపాలించింది. ప్రజలంతా గమనించి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. బీజేపీకి ఓటేస్తే దేశ సమగ్రతకే ప్రమాదకరమన్నారు.



వసవి తావాన్ని తగ్గించ

# ప్రకృతి ప్రసాదాలు


రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగు తుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రెండ్రోజులుగా వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ ఉక్కపోత మాత్రం తగ్గలేదు. దీంతో ప్రజలు శీతలపానీయాల వైపు ఆసక్తి చూపారు. అయితే ఈ వేసవిలో కొబ్బరిబొండాలు, నిమ్మరసం, పండ్లు తీసుకుంటేనే మేలని వైద్యులు సూచిస్తున్నారు. శీతలపానీయాల వల్ల తాత్కాలిక చల్లదనం అనిపించినప్పటికీ అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. ఈ వేసవిలో అధికంగా కొబ్బరినీరు, నిమ్మరసంతో ఎండ వేడిని తరిమేయవచ్చని సూచిస్తున్నారు.



ఎండలు మండుతున్నాయి. ఎండలో తిరుగు తూ కాస్త పనులు చేసుకోవాలంటే శరీరానికి ఎం తో శక్తి అవసరం. శరీరం తిరిగి శక్తి పుంజుకుని వేసవిని చల్లగా మార్చుకునేందుకు కొబ్బరినీరు దివ్య ఔషధంగా పని చేస్తుంది. కొబ్బరినీరు ఆరో గ్యంతోపాటు సౌందర్య రక్ష ణకు ఎంతో మేలు చే స్తుంది. దీంతోపాటు వేసవి కాలంలో చలువకు పుచ్చకాయలు, చల్లటి నీటికోసం కుండలకు ఆదర ణ పెరుగుతోంది. మండే ఎండల్లో ఉష్ణతాపాన్ని తగ్గించుకుని ఉల్లాసంగా ఉండేందుకు ప్రజలు వివిధ రకాల జాగ్రత్తలు పాటిస్తుంటారు. అందులో కొబ్బరిబొండాలు, పుచ్చకాయలు ముందుంటాయి. అయితే వేసవిలో కొబ్బరిబొండాలు, పుచ్చకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్కో కొబ్బరి బొండం రూ. 20 25గా ధర పలుకుతోంది. లీటరు కొబ్బరినీళ్లు రూ. 70నుంచి రూ.120వరకు విక్రయి స్తున్నారు. ఇక పుచ్చకాయలను కిలో రూ.20 చొప్పున విక్రయిస్తు న్నారు. ఇక పేదోడి ఫ్రిజ్ కుండలకు కూడా గిరాకీ పెరిగింది. ఒక్కో కుండ రూ.180, కూజాలను రూ. 150వరకు విక్రయిస్తు న్నారు. బత్తాయి, ఆపిల్, సపోట, పైనా పిల్, ద్రాక్ష, చెరుకు రసాన్ని గ్లాస్ ఒక్కింటికి రూ.20లు చొప్పున వ్యాపారులు విక్రయి స్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు పెరగడంతో ధరలు పెరిగే అవకాశముంది.

### కొబ్బరినీటిలో ఔషధగుణాలు

- కొబ్బరినీటిలో కొలెస్ట్రాల్ శాతం తక్కు వగా ఉంటుంది.
- తరచూ తాగడం వల్ల శరీరంలోని చక్కెర స్థాయిని అదుపులో ఉంటుంది.
- కొబ్బరినీళ్లలో సోడియం తక్కువగా ఉంటుంది గనుక వాటిని తాగితే అతిసారం, గుండె సంబంధిత సమస్యలు దూరమ వుతాయి.
- మొఖంపై మొటిమలు, నల్లటి మచ్చలు తగ్గాలంటే లేత కొబ్బరిగుజ్జును రాసుకుంటే ఫలితం వెంటనే తెలుస్తుంది.
- ప్రొటీన్ల లోపం ఉన్నవారికి కొబ్బరినీరు దివ్యఔషధంగా పనిచేస్తాయి.
- కొబ్బరినీటిలో పసుపు, గంధం కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే ము ఖం కాంతివంతంగా మెరిసిపోతుంది.
- కొబ్బరినీళ్లలో సుమారు 95శాతం నీళ్లు, కేవలం 2.8శాతం చక్కెర, 0.5శాతం వర కు లవణాలుంటాయి.
- ప్రక్టోజ్, సుక్రోజ్ అనేక పోషకపదార్థాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని స్తాయి.



# మూత్రపిండాల్లో రాళ్లకు హోమియో చికిత్స

మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం ఈ మధ్య కాలంలో చాలా మందిలో కనిపిస్తున్న సమస్య. ఒక సర్వే ప్రకారం భారత్‌లోని పురుషుల్లో 10.6 శాతం, స్త్రీలలో 7.1 శాతం ఈ సమస్యతో బాధపడుతున్నారని తేలింది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, స్థూలకాయం వంటివి దీనికి ప్రధాన కారణాలు. మన శరీరం ఒక భారీ కర్మాగారం లాంటివి. ఇందులో నిరంతరం రకరకాల జీవక్రియలు జరుగుతుంటాయి. వీటిలో మూడు విసర్జక అవయవాలు కీలక పాత్ర పోషిస్తాయి. అవి మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, చర్మం. వీటిల్లో 90 శాతం మలినాలను విసర్జించేది మూత్రపిండాలే. కిడ్నీలు రక్తంలోని విష పదార్థాలను, అదనపు నీటిని క్రమంగా తొలగిస్తుంటాయి.

మన మూత్రపిండాలు రోజుకు 200 లీటర్ల రక్తాన్ని వడపోస్తాయి. నేటి ఆధునిక జీవన శైలిలో చాలామంది సరిపడా నీళ్లు కూడా తాగలేకపోతున్నారు. ఫలితంగా మూత్రపిండాల్లో రాళ్ల సమస్య పెరుగుతోంది. చాలా సందర్భాల్లో ఈ రాళ్లు చిన్నవిగా ఉండి, మూత్రంతో విసర్జింపబడతాయయి. కొన్నిసార్లు రాళ్ల పరిమాణం పెద్దవిగా ఉండి, మూత్ర నాళాల్లో చిక్కుకుని తీవ్రమైన నొప్పి కలిగిస్తాయి.

### కారణాలు

అధిక బరువు, ద్రవపదార్థాలు సరిపడా తీసుకోక పోవడం
మూత్రావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్
జన్యుపరమైన ఇన్‌ఫెకన్లు
ఎక్కువగా వేడి వాతావరణంలో ఉండటం
వంశపారంపర్యం కొన్ని రకాల మందుల వాడకం

### లక్షణాలు

పొత్తి కడుపులో తీవ్రమైన నొప్పి
నీరసం, వికారం, తీవ్రమైన జ్వరం
మూత్రంలో రక్తం పడటం (దీన్ని హిమచ్యూరియా అంటారు)
మూత్రంలో మంట, చీము రావడం

### జాగ్రత్తలు

నీటిని ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 4 లీటర్ల ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

కిడ్నీలో ఆక్సలేట్ రాళ్లు ఉంటే, ఆక్సలేట్ ఉండే పదార్థం, అంటే చాక్‌లెట్, పాలకూర, సోయా, ఎండు చిక్కుడు వంటివి తీసుకోకూడదు.

కాల్షియం సిట్రేట్‌కు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నివారించే లక్షణం ఉంది. కాబట్టి అవి శరీరానికి అందేలా ఆహార నియమాలు పాటించాలి.

కూల్‌డ్రింక్‌లను అసలు ముట్టుకోకూడదు.

### నిర్ధారణ పరీక్షలు

కిడ్నీ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, కిడ్నీ పరీక్ష
రక్త పరీక్ష, మూత్ర పరీక్ష

### హోమియో చికిత్స

హోమియోపతిలో శారీరక, మానసిక లక్షణాలను పరిగణనలోకి తీసుకుని ఎలాంటి సర్జరీ అవసరం లేకుండానే కిడ్నీలో రాళ్లు తొలగించవచ్చు. రాళ్ల పరిమాణం, అవి ఏ వైపు ఏర్పడ్డాయో వంటి వివరాల ఆధారంగా మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా బెరిబెరి వల్గరీస్, సరసపరిల్ల, కలెబారియకార్బ్, పెరిర బ్రావ, కొలొసింత్ మందులను డాక్టర్ పర్యవేక్షణలో వాడాలి.



# పసికందులు ఏడుస్తూనే ఉంటే.. ?

**ప్రశ్న:** మా బాబు వయసు నెల రోజులు. కానీ అందరు పిల్లల్లా పాలు తాగగానే పడుకోడు. ఏడుస్తూ ఉంటాడు. ఇలా రోజంతా ఎక్కువ సమయంపాటు ఏడుస్తూనే ఉంటాడు. రాత్రుళ్లు కొన్ని గంటలపాటే నిద్రపోతాడు. ఇది సహజమేనా, లేక బాబుకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉందని అనుకోవాలా?

కొందరు పసికందులు చక్కగా పాలు తాగుతారు. నిద్ర పోతారు. ఆడుకుంటూ ఉంటారు. ఇంకొందరు ఇందుకు భిన్నంగా ఆ పనులన్నీ సక్రమంగా చేస్తూ కూడా ఆపకుండా ఏడుస్తూ ఉంటారు. ఇందుకు ఎన్నో కారణాలుంటాయి. పసికందులు ఆకలి వేసినప్పుడు, పక్క తడుపుకున్నప్పుడు, చీమలు మొదలైన పురుగులు కుట్టినప్పుడు, చీకాకు కలిగినప్పుడు, విసుగు పుట్టినప్పుడు, అమ్మ అటెన్షన్ కోసం.... ఇలా పలు రకాల కారణాల వల్ల ఏడుస్తారు. అయితే ఆ అవసరాలు తీరగానే వెంటనే ఏడుపు ఆపేస్తూ ఉంటారు. అలా కాకుండా అకారణంగా పిల్లలు ఏడుస్తూ ఉన్నారంటే వాళ్ల సమస్యను 'కాలిక్ పెయిన్'గా అనుమానించాలి. పొట్టలో నొప్పి, కడుపులో గ్యాస్ చేరుకోవడం, తల్లిపాలు పడకపోవటం, లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ వల్ల ఇది వస్తుంది. ఇలాంటి కాలిక్ పెయిన్‌తోపాటు విరోచనాలు, వాంతులు కూడా కనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి. పాల అలర్జీ ఉంటే తల్లి పాలు, పోత పాలు మానేసి వైద్యులు సూచించిన మిల్క్ పౌడర్ వాడాలి. ఈ స్థితి కొన్ని నెలలపాటు వేధించి సర్దుకుంటుంది. అరుదుగా కొందరిలో కొన్నేళ్లపాటు కొనసాగుతుంది. ఏదేమైనా పసికందులు ఆపకుండా ఏడుస్తూ ఉంటే పిల్లల వైద్యులను సంప్రతించటం అన్ని విధాలా శ్రేయస్కరం.

# వేసవిలో పిల్లలు చల్లగా!

**డాక్టర్! మా పాపకు నాలుగు నెలలు. ఎండ వేడి నుంచి పాపను ఎలా కాపాడుకోవాలి? ఎండదెబ్బ తగలకుండా ఉండాలంటే ఏం చేయాలి? అసలు వేసవిలో పసిపిల్లలకు ఎలాంటి సమస్యలు వస్తాయి?**

వేసవిలో పసిపిల్లలను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. పిల్లల చర్మం చాలా సున్నితం కాబట్టి, శరీరంలో నుంచి నీరు త్వరత్వరగా ఆవిరవుతూ ఉంటుంది. దాంతో పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవుతూ ఉంటారు. శరీరం వేడెక్కిపోతుంది. కొంతమంది పిల్లలకు తల్లి పాలు సరిపోకపోవచ్చు. దాంతో బరువు కోల్పోతారు. ఈ కాలంలో పిల్లలు తమ శరీర బరువులో 10% కోల్పోతారు. అయితే బరువు 20% కంటే తగ్గితే ఆ ప్రభావం మూత్రపిండాల మీద పడుతుంది. శరీరంలో ఎలక్ట్రొలైట్లలో తరుగుదల ఏర్పడుతుంది. సోడియం ఎక్కువై, మూత్రపిండాల సమస్యలు మొదలవుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే తల్లులు



వైద్యుల సూచనల మేరకు పాల ఉత్పత్తి పెరిగేటట్టు మందులు వాడాలి, లేదా పాలకు ప్రత్యామ్నాయాలు పిల్లలకు వాడాలి. అయితే పిల్లలకు పాలు సరిపోతున్నాయో, లేదో గుర్తించాలంటే కొన్ని లక్షణాలను గమనించాలి. పిల్లలు 20%కి మించి బరువు తగ్గినా, ఎక్కువగా ఏడుస్తున్నా, తల్లి దగ్గర పాలు తాగిన తర్వాత కూడా ఏడుస్తున్నా, రోజుకి 7, 8 సార్ల కంటే తక్కువసార్లు మూత్రవిసర్జన చేస్తున్నా... ఆ పిల్లలు తల్లి పాలు సరిపోక డీహైడ్రేషన్‌కు గురయ్యారని గ్రహించాలి. అలాగే కొంతమంది పిల్లల్లో కామెర్లు కూడా కనిపిస్తాయి. ఇలాంటప్పుడు పిల్లలకు తల్లిపాలతో పాటు పోత పాలు కూడా తాగించాల్సి ఉంటుంది. ఈ జాగ్రత్తలతోపాటు ఇంట్లో చల్లని వాతావరణాన్ని సృష్టించాలి. ఏసిలు ఉంటే 28 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకు సెట్ చేయాలి. ఏసి లేకపోతే తలుపులు, కిటికీలకు మ్యాట్స్, వట్టివేళ్ల చాపలు కట్టాలి. నీళ్లు నింపిన బక్కెట్లు గదిలో ఉంచాలి.

# ఎప్పుడు, ఏం తినాలి?

**ఆకలేసినప్పుడు, వీలు కుదిరినప్పుడు తింటూ ఉంటాం! కానీ అల్పాహారానికైనా, భోజనానికైనా నియమిత సమయాలు పాటించాలి. అప్పుడే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.**



### ఉదయం అల్పాహారం

ఉదయం 7 నుంచి 8 గంటలలోపు తినేయాలి.

ఎటువంటి పరిస్థితుల్లోనూ 10 దాటిన తర్వాత అల్పాహారం తినకూడదు.

నిద్ర లేచిన అరగంటలోపే అల్పాహారం తీసుకోవాలి.

### మధ్యాహ్న భోజనం

12.30 నుంచి 2 గంటల్లోపు మధ్యాహ్న భోజనం ముగించాలి.

సాయంత్రం 4 తర్వాత తినకూడదు.

ఉదయం అల్పాహారానికి మధ్యాహ్న భోజనానికి మధ్య 4 గంటల విరామం మాత్రమే ఉండాలి.

### రాత్రి భోజనం


6 నుంచి 9 గంటల మధ్య ముగించాలి.

రాత్రి 10 దాటిన తర్వాత తినకూడదు.

# ఫిట్‌నెస్ కోసం డ్యాన్స్

వేడుకలు, సంతోషకరమైన సందర్భాల్లో మాత్రమే నలుగురు కలిసి చిందేయడం సహజం! కానీ ఇప్పుడు నిత్యం డ్యాన్స్ మంత్రాన్ని జపిస్తోంది నగర యువత. అదే మంటే అదొక ఫిట్‌నెస్ మంత్రగా చెబుతున్నారు. ఇల్లు, కార్యాలయం..పబ్‌లలో సైతం నృత్యంతో కసరత్తు చేస్తున్నారు. యోగా, జిమ్, జాగింగ్, వాకింగ్ లాగే ఇప్పుడు నృత్యం కూడా వ్యాయామ క్రియగా మారిపోయింది.

అబ్బాయిలు కండలు పెంచడానికి, అమ్మాయిలు అందమైన శరీరాకృతిని సొంతం చేసుకునేందుకు చాలా వ్యాయామశాలలున్నా యి. ఎన్నో వ్యాయామ పద్ధతులూ ఉన్నాయి. కానీ జిమ్‌కెళ్లి బరువులు ఎత్తుతూ, అద్దంలో పదే పదే కండలు చూసుకుంటూ చేయడం బోరింగ్‌గా ఫీలయ్యే వారు...! పార్కులో రోజూ ఏం నడుస్తాం! అను కునేవారికి ఇప్పుడు డ్యాన్స్ ఫిట్‌నెస్ ఒక మంచి అవకాశంగా కనప డుతోంది. వ్యాయామం చేయాలనుకునేవారు, డ్యాన్స్‌ను ఇష్టపడేవారు ఎక్కువగా డ్యాన్స్ వ్యాయామాన్ని కోరుకుం టున్నారు. వాస్తవానికి ఈ పద్ధతి వ్యాయామం ఆరేళ్ల నుంచి పరిచయమైనా, ఇటీవల నగర యువత నోళ్లలో నానుతోం ది. కార్పొరేట్ ఉద్యోగులు, యువత, కుర్ర కారు డ్యాన్స్ వర్కవుట్లపై మక్కువ చూపుతున్నారు. సహజంగా యూత్ ట్రెండ్లన్నీ పాశ్చాత్య దేశాలనుంచి దిగుమతి చేసు కుంటామనే అపోహ ఉంది! కానీ ఈ డ్యాన్స్ వ్యాయామం మాత్రం పూర్తి గా మన దేశంలో మొదలైన ట్రెండ్. ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో మొదలై, బెంగళూరు, చెన్నై, పుణె, హైదరాబాద్ నగరాల యువతను ఉర్రూతలూగిస్తోం ది. దాంతో ఇప్పుడు వెస్ట్రన్ డ్యాన్స్ ఇనిస్టి ట్యూట్లన్నీ డ్యాన్స్ వ్యాయామ కేంద్రాలుగా మారాయి. డ్యాన్స్ మాస్టర్స్ ఫిట్‌నెస్ కోచ్‌ల అవతారం దాల్చారు.



### ఆదాయవనరుగా..!

మ్యూజిక్, డ్యాన్స్ కలగలసిన నృత్య ఫిట్‌నెస్ నేర్పించే వారికి ఇప్పుడు మంచి డిమాండే ఉంది. సిని మా, టీవీ రంగాల్లో కొరియోగ్రాఫర్‌గా రాణించాలను కునే యువత ముఖ్యంగా డ్యాన్స్ ఫిట్‌నెస్ వర్కవుట్లు నేర్పించడాన్ని ప్రత్యేక ఆదాయ వనరుగా ఎంచుకుంటు న్నారు. డ్యాన్స్ వ్యాయమ కోచింగ్ సెంటర్లు నెలకు రూ1000 నుంచి రూ6000 వరకు ఫీజు వసూలుచేస్తున్నాయి. అవి నృత్య శిక్షకుడు, ప్రాంతం ఆధారంగా ఫీజు ఉంటుంది. నలుగురితో కలిసి డ్యాన్స్ చేయడం వల్ల, సరదాగానూ, ఉల్లాసంగానూ ఉండటంతో సాధారణ వ్యాయా మాన్ని ఇష్టపడనివారు సైతం, బృంద నృత్యవ్యాయామంపై ఆసక్తి చూపుతున్నారు.

### ఇవే డ్యాన్స్ వర్కవుట్లు

బాలీఫిట్‌నెస్, బోక్వా, మసాలా భాంగ్రా, బూట్ క్యాంప్, క్రాస్‌ఫిట్, జుంబా, ఎరోబిక్స్, సల్సా వంటి నృత్యరీతుల్ని ముఖ్యంగా ఫిట్‌నెస్ వర్కవుట్లుగా చేస్తున్నారు. వీటిలో ఒక్కో నృత్యం ఒక్కో రకంగా ఉంటుంది. పంజాబీ జానపద నృత్యం మసాలా భాంగ్రా. అధికబరువు తగ్గేందుకు, శరీరంలో ఎక్కువ కేలరీలు ఖర్చు అయేందుకు ఇది సరైన వ్యాయామంగా చెబుతున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. శరీరాన్ని ఎల్, కే, ఓ ఆకారాలుగా వొంచుతూ చేసే వ్యాయామం బోక్వా. దీనిలో హోరెత్తే సంగీతంతోపాటు, దక్షిణాఫ్రికా నృత్య భంగిమలు ఉంటాయి. శరీర భాగాల్లో అసహజంగా పేరుకుపోయిన కొవ్వును కరిగించేందుకు బోక్వా ఉపకరిస్తుంది. వ్యాయామం శరీర, మానసిక ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ ఆ వ్యాయామ శిక్షణ సరైన నిపుణుల వద్ద తీసుకోవాలి.



# ఐమ్యాక్స్ 3డీ ఫార్మాట్‌లో జై హనుమాన్

తేజ సజ్జ కీలక పాత్రలో ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హీరో ఫిల్మ్ 'హను-మాన్'. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు ఈ మూవీకి కొనసాగింపుగా 'జై హనుమాన్' రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తవగా, త్వరలోనే ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది. మంగళవారం హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'జై హనుమాన్' మూవీని ఐమ్యాక్స్ 3డీ ఫార్మాట్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అంతేకాదు, ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో వచ్చే ప్రతీ సినిమానూ ఐమ్యాక్స్ 3డీ వెర్షన్‌లోనే తీసుకురానున్నట్లు తెలిపారు. నిప్పులు కక్కుతున్న డ్రాగన్ ఎదురుగా హనుమాన్ నిలబడి ఉన్న పోస్టర్‌ను పంచుకున్నారు. ఇప్పటివరకూ చైనా మూవీలకే పరిమితమైన డ్రాగన్ కాన్సెప్ట్ ఇప్పుడు ఇండియా సినిమాలోనూ అలరించనుంది. మరోవైపు సీక్వెల్‌లో నటించే నటీనటుల ఎంపిక పక్రియను కూడా ప్రశాంత్‌వర్మ వేగవంతం చేశారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్న చిత్రం కావడంతో బాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటుల పేర్లను పరిశీలిస్తున్నారు. 'హను-మాన్' పూర్తిగా బడ్జెట్ పరిమితుల మధ్య తీసినా క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఇంత తక్కువ బ్జడెట్ అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చారంటూ విమర్శకులు సైతం టీమ్‌ను మెచ్చుకున్నారు. రాబోయే 'జై హనుమాన్'కు ఆ ఇబ్బంది లేదు. దీంతో తొలి భాగాన్ని మించి ఉండేలా సినిమా తీయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో భారతీయ ప్రేక్షకులకు చక్కటి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులోభాగంగానే ఐమ్యాక్స్ 3డీ వెర్షన్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చారు. తాజా ప్రకటనతో సీక్వెల్‌పై మరిన్ని అంచనాలు పెరిగాయి.





# రామ్‌చరణ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది

## బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్

ఆపరేషన్ వాలెంటైన్'తో తెలుగువారికి పరిచయమైన బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులు చేస్తున్న ఆమె .. రామ్‌చరణ్‌ను తాను ఎంతగానో అభిమానిస్తున్నట్లు చెప్పారు. 'చరణ్ అంటే నాకెంతో ఇష్టం. డ్యాన్స్ అద్భుతంగా ఉంటుంది. ఎప్పటి నుంచో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని అనుకుంటున్నా. నా తదుపరి తెలుగు సినిమా ఆయనతోనే ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'బడే మియా ఛోటే మియా' కోసం వయసులో తనకంటే 30 ఏళ్లు పెద్దవాడైన అక్షయ్ కుమార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ఆమె స్పందించారు. 'ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. వయసులో పెద్దవారైన పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించడానికి నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే, స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్నప్పుడు ఎక్కువ మంది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించవచ్చు. అక్షయ్ కుమార్ సూపర్ స్టార్. ఆయనతో వర్క్ చేయడాన్ని నేనెంతగానో ఎంజాయ్ చేశా. ఎంతోమంది ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుకుంటారు. కొంతమందికి మాత్రమే ఆ అవకాశం లభిస్తుంది. తమ చిత్రాల్లోకి నటీనటులుగా ఎవరిని తీసుకోవాలనేది పూర్తిగా దర్శకుల నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా మాట్లాడాలనుకోవడం లేదు. అగ్ర నటులతోనే కాకుండా యువ హీరోల చిత్రాల్లోనూ నటించాలనుకుంటున్నా' అని ఆమె తెలిపారు. 2017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్నారు మానుషి చిల్లర్. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'సామ్రాట్ పృథ్వీరాజ్'తో ఆమె తెరంగేట్రం చేశారు. 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాల్లో నటించారు. సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'కబీర్ సింగ్'లో హీరోయిన్‌గా తొలుత తనకే అవకాశం వచ్చిందని.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ వదులుకున్నట్లు తెలిపారు.

# కల్కిలో అశ్వత్థామగా అమితాబ్

మహాభారతంలోని ఒక పాత్ర అశ్వత్థామ. సప్త చిరంజీవులుగా పేరుగాంచిన అశ్వత్థామ, బలిచక్రవర్తి, వ్యాస మహర్షి, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడులలో అతను ఒకడు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ' ఇందులో ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా కనిపించనున్నట్లు తెలుపుతూ ఆయన పాత్రను పరిచయం చేసింది. శరీరంపై గాయాలతో, చిరిగిన వస్త్రాలు కట్టుకుని అమితాబ్ కనిపించారు. ఒక షాట్‌లో యంగ్ అమితాబ్ నుదుటిపై మణి కనిపిస్తుంది. 'ద్వాపర యుగం నుంచి దశావతారం కోసం ఎదురు చూస్తున్నా. ద్రోణాచార్య తనయుడు అశ్వత్థామని..' అని అమితాబ్ చెప్పడంతో ఇంతకీ ఎవరాయన అని నెటిజన్లు గూగుల్‌లో తెగ వెతికేస్తున్నారు. శ్రీకృష్ణుడు అతనికి ఇచ్చిన శాపం ఏంటన్న ఆసక్తి నెలకొంది.

పాండవులు, కౌరవులకు గురువైన ద్రోణుని ఏకైక కుమారుడు అశ్వత్థామ. అతడి తల్లి కృపి. ద్రోణుడి తపస్సుకు మెచ్చి, శివుని వరం వల్ల అతడు నుదుటిపై మణితో జన్మిస్తాడు. ఆ మణి ప్రభావం కారణం ఇతర మానవులతో పోలిస్తే, ఆకలి, దప్పుల నుంచి రక్షణ పొందగలడు. అర్జునుడితో సమానంగా ధనుర్విద్యలో నైపుణ్యం సాధిస్తాడు.ద్రోణాచార్యుడు పాండవ సైన్యంపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన ధర్మరాజు 'అశ్వత్థామ హతః..' అని గట్టిగా చెప్పి..



'కుంజరః' అని నెమ్మదిగా అంటాడు. తన కుమారుడే మరణించాడనుకుని ద్రోణాచార్యుడు యుద్ధంలో అస్త్ర సన్యాసం చేస్తాడు. ఇదే అదనుగా భావించిన దృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిని చంపేస్తాడు. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో కర్ణ దుర్యోధనాదులు, ఇతర కౌరవ సైన్యాన్ని మట్టుబెట్టి మహాభారత యుద్ధంలో పాండవులు విజయం సాధిస్తారు. తండ్రి మరణం, స్నేహితులైన కౌరవులు నశించడం సహించలేకపోయిన అశ్వత్థామ తీవ్ర కోపంతో తన తండ్రి అనుగ్రహించిన బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని 'అపాండవీయం అవుగాక' అని ప్రయోగిస్తాడు. పోటీగా అర్జునుడు కూడా అదే అస్త్రాన్ని ప్రయోగిస్తాడు. పెద్దల సూచన మేరకు అర్జునుడు తన అస్త్రాన్ని వెనక్కి తీసుకుంటాడు. అశ్వత్థామ ప్రయోగంతో ఉత్తర గర్భం విచ్ఛినమవుతుంది. అశ్వత్థామ కుటిల బుద్ధికి కోపోద్రిక్తుడైన శ్రీకృష్ణుడు అతడి తలపై ఉన్న సహజ మణిని తీసి శపిస్తాడు. 'ఒంటి నుంచి రక్తం కారుతూ దుర్గంధంతో, ఆహారం దొరక్క మండిపోతున్న శరీరంతో ఈ భూమ్మీదే తిరుగు' అని పేర్కొంటాడు. బ్రహ్మశిరోనామకాస్త్ర ప్రయోగం వల్ల ఉత్తర గర్భంలో మరణించిన శిశువును కృష్ణుడు తన యోగమాయతో ప్రాణంపోసి బతికిస్తాడు. ఆ బిడ్డ పుట్టిన తర్వాత ప్రతి ఒక్కరినీ పరీక్షగా చూస్తుండటంతో అతడికి పరీక్షిత్ అని పేరు పెడతారు. 'కల్కి'లో అమితాబ్ అశ్వత్థామగా కనిపిస్తుండటంతో ఆ పాత్రపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో దీపికా పదుకొణె, కమల్‌హాసన్, దిశా పటానీ, రాజేంద్రప్రసాద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# శరవేగంగా విశ్వంభర షూటింగ్



## సంక్రాంతికి విడుదల చేసేలా ప్లాన్

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. 'భారీ సెట్‌లో యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ పూర్తయింది. 26 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో ఇంటర్వెల్ ఫైటింగ్ సీన్స్‌ను చిత్రీకరించారు. ఇందుకోసం 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని రూపొందించారు. ఈ సన్నివేశం సినిమాకే అదనపు ఆకర్షణ కానుంది. యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్ లక్ష్మణ్ పర్యవేక్షణలో దీన్ని చిత్రీకరించారు. హైలెవెల్ వీఎఫ్ఎక్స్‌లతో ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు' అని సినీ వర్గాల వెల్లడించాయి. ఇటీవల హనుమాన్ విగ్రహం వద్ద చిరు దిగిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరలైన సంగతి తెలిసిందే. ఇది సినిమాలో ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. సోషియో ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న 'విశ్వంభర' వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. 18 ఏళ్ల తర్వాత చిరు-త్రిష ఈ సినిమా కోసం కలిసి నటిస్తుండడంతో దానిపై అభిమానుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యమిస్తూ రూపొందిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు. దాదాపు రూ.200 కోట్ల భారీ బ్జడెట్‌తో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు టాక్. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక బ్జడెట్‌తో రూపొందుతున్న సినిమాగా ఇది నిలవనుంది. ఇక దీనిలో త్రిష ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు టాక్. ఆమెతో పాటు సురభి, ఇషాచావ్లా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# రజనీ చిత్రం ఫస్ట్ లుక్‌పై భారీ స్పందన

సూపర్‌స్టార్ రజనీకాంత్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో ఒక చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. రజనీ 171 వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ విడుదల చేయగా, రజనీకాంత్ అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను రాబట్టుకుంది. సినిమా టైటిల్‌ను విడుదల చేయనున్నట్లు లోకేశ్ తన సోషల్ మీడియాలో తెలపడంతో నెట్టింట ఇప్పుడు ఈ వార్త బాగా హల్‌చల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో కింగ్ నాగార్జున కీలక పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కు వచ్చి నాగార్జునకు స్టోరీ చెప్పడం, అది నచ్చి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో న్యూస్ చక్కర్లు కొడుతోంది. దీంతో మునుపెన్నడు చూడని మల్టీస్టారర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇప్పటికే రానా, దల్కర్ సల్మాన్ ఇందులో కనిపించబోతున్నట్లు తెలుస్తుండగా ఇటీవలే సీనియర్ నటి శోభన, శృతిహసన్ కూడా ఈ చిత్రంలో భాగమవుతునట్లు వార్తలు వినిపిస్తుండడంతో ఈ సినిమాపై రోజురోజుకు అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. కాగా నాగార్జున తాజాగా ధనుష్ హీరోగా రూపొందుతున్న కుబేరా సినిమాలోనూ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. ఈ చిత్రం టైమ్ ట్రావెల్ కథ అని కొందరు, లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ చిత్రాలలోని రోలెక్స్‌కు రిలేటెడ్‌గా ఈ సినిమా ఉండబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాకు తంగమ్ అనే పేర్ను ÷నైల్ చేసినట్లు తెలుస్తోండగా జూన్‌లో ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లి ఈ ఏడాది చివరకు సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ఎటాన్ చేస్తున్నారు. అన్బరివు స్టంట్స్, అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. దీని తర్వాత 'ఖైదీ 2' మొదలు పెట్టనున్నట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో లోకేష్ తెలిపాడు.



# రావు రమేశ్ ప్రధాన పాత్రలో మరో సినిమా

తమిళ, మలయాళ, హిందీ క్యారెక్టర్ నటులు తెలుగు పరిశ్రమను ఏలుతున్న ఈ సమయంలో తెలుగు నటులు తమ ప్రాతినిధ్యాన్ని నిలబెట్టుకోవాలంటే ఎంతో కష్టపడాలి, వైవిధ్యం చూపించాలి. అలా నిలబెట్టుకున్న నటుల్లో రావు రమేష్ ని ప్రధమంగా చెప్పకోవచ్చు. ఎంతమంది ఎన్నివిధాలుగా పోటీగా వున్నా, రావు రమేష్ తనదైన శైలిలో, తనదైన మాటలు, హావభావాలతో తెలుగు ప్రేక్షకులని రంజింపచేస్తూ, తనకుంటూ ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు. అటువంటి రావు రమేష్ చిన్న పాత్రల దగ్గర నుండి, ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ నటుడిగా తెలుగు ప్రేక్షకులకి ఎంతో వినోదం పంచారు, ప్రేక్షకులకి ఎంతో దగ్గరయ్యారు. అయితే ఇప్పుడు దర్శక నిర్మాతలు రావు రమేష్ ని దృష్టిలో పెట్టుకొని కథలు రాసుకుంటూ అతన్ని ప్రధాన పాత్రలో చూపించి ప్రేక్షకులకి నూటికి నూరు శాతం వినోదాన్ని అందించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో మొదటి ప్రయత్నంగా 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' సినిమా పూర్తయింది, విడుదలకి సిద్ధంగా వుంది. ఇందులో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషిస్తే, లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. ఆ సినిమా తరువాత దర్శకుడు మారుతి టీమ్ ప్రోడక్ట్ మరియు వానరా సెల్యూలాయిడ్ సంయుక్త నిర్మాణంలో రావు రమేష్ ప్రధాన పాత్రలో ఇంకొక సినిమా ఈరోజు ప్రారంభం అయింది. అంకిత్ కొయ్య, విశాఖ ధిమన్ ఇందులో జంటగా నటిస్తుండగా, బాల సుబ్రహ్మణ్యమ్ దర్శకుడు, ఎ విజయ్ పాల్ రెడ్డి నిర్మాత. ఈ సినిమా పేరు 'బ్యూటీ' అని పెట్టారు. ఈ చిత్ర పూజా కార్యక్రమాలు హైదరాబాద్ లోని ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ఈరోజు జరిగాయి. దర్శకుడు మారుతి క్లాప్ కొట్టగా, మరో దర్శకుడు బుచ్చిబాబు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీరశంకర్, సుబ్బు మంగాదేవి, డార్లింగ్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఇది ఒక ప్రేమ, కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కబోతున్న చిత్రం అని చిత్ర నిర్వాహకులు చెపుతున్నారు. మే 2వ తేదీ నుండి చిత్రీకరణ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ సినిమాకి విజయ్ బుల్గానిన్ సంగీతం, సిద్ధం మనోహర్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. రావు రమేష్ ప్రధాన పాత్రలో ఇంకో సినిమా కూడా రేపు ప్రారంభం కానుంది.



## రైతులను నమ్మించి మోసం చేశారు

**మండిపడ్డ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వినోద్**


**కరీంనగర్,ఏప్రిల్23(వెలుతురు):** కాంగ్రెస్ పార్టీ పాలనపై కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఫైర్ అయ్యారు. మార్పు తెస్తాం.. అందరిని ఉద్దరిస్తాం.. రైతు రాజ్యం తెస్తాం..రైతుల బాధలు తీరుస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు వట్టి నీటిమూటలుగా మారిపోతున్నాయని అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ముంజంపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్దతు ధరకు ధాన్యం కొనడంతో పాటు క్వింటాలుకు రూ.500ల బోనస్ ఇస్తామన్నారు. బోనస్ పైసలు దేవుడెరుగు ఉన్న ధాన్యమే కొంటలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో లేవని, ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని ఇప్పుడు ఆగస్టు 15లోగా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని విమర్శించారు. యాసంగి పంటలకు సాగునీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ళకు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణా రావు, జెడ్పీటీసీ శేఖర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

**మాది ప్యాకేజీ పార్టీ కాదు..**

## ప్రజాస్వామ్య పార్టీ

**ఇండియా కూటమి అభ్యర్థి అప్పనర్సకే ఓటేయాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రచారం**



**రంపచోడవరం,ఏప్రిల్23(వెలుతురు):** ప్యాకేజీ పార్టీ కాదు-సిపిఎం ప్రజాస్వామ్య పార్టీ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గిరిజన ప్రాంత పరిరక్షణ, అభివృద్ధి కోసం ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట.అప్పలనర్సకి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్యాకేజీ పార్టీ సిపిఎం కాదని ప్రజాస్వామ్య పార్టీ అని అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ విప్లవ పార్టీ ఎర్రజెండా పార్టీ అని చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.పోతురాజు, టి.సూర్యనారాయణ మాట్లాడుతూ కోసంగినుండి పెద్దపాడు వరకు సుమారు 8 గ్రామాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. రోడ్డు పనులు ఆగిపోయాయని చెప్పారు. చాపరాయి మిద్దగా బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేసి 8 గ్రామ ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్ర.భాస్కరావు, కొర్ర.దివ్య పాంగి.ఇంద్ర, వంతల.సుబ్బారావు, కొర్ర.నాయుడు, యేడబోయి.తౌడన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఐపిఎస్ అధికాని వెంకటేశ్వరరావు కేసు

**29కి వాయిదా వేసిన పరిపాలనా ట్రిబ్యునల్**

**అమరావతి,ఏప్రిల్ 23(వెలుతురు):** సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు కేసు ఈనెల 29 కు వాయిదా పడింది. తనపై రెండవసారి సస్పెన్షన్ విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌ను వెంకటేశ్వరరావు ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణకు రాగా...ఒకే ఆరోపణలపై రెండవ సారి ఎలా సస్పెండ్ చేస్తారని ప్రభుత్వ న్యాయవాదిని బెంచ్ ప్రశ్నించింది. వేరే అంశాలు ఏవీ నోట్స్ ÷ల్‌లో లేవని బెంచ్ పేర్కొంది. ఛార్జ్ షీట్ నాలుగుసార్లు వేయడాన్ని ఏ విధంగా సమర్థించుకుంటారు అని ప్రశ్నించింది. అడ్వకేట్ జనరల్ వాదనతో సంబంధం లేకుండా రికార్డ్ ఉందంటూ బెంచ్ వ్యాఖ్యలు చేసింది. పెగాసిస్, మీడియాతో మాట్లాడిన అంశాలపై ఏబీ వెంకటేశ్వర రావు స్పష్టంగా రిప్లై ఇచ్చినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీసింది. పరిశీలించకుండా రెండవ సారి సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధమని పేర్కొంది. అవే ఆరోపణలపై రెండవ సారి విచారణ ఏమిటంటూ ప్రశ్నించిన కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్.. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. కాగా.. ఏబీ వెంకటేశ్వరరావు గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ క్రమంలో 2019 ఎన్నికల సమయంలో ఆయనపై వైసీపీ ఫిర్యాదులు చేయడంతో ఈసీ ఆయనను పదవి నుంచి తప్పించింది. ఇక వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. ఇజ్రాయెల్ నుంచి కొన్ని పరికరాలు కొనుగోలు చేసి, తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఏబీవీపై వైసీపీ ప్రభుత్వం ఆరోపణలు చేసి ఆయన్ను సస్పెండ్ చేసింది. ఆపై సుప్రీం కోర్టుకు ఆదేశాలతో ఏబీవీ విధుల్లో చేరారు. అయితే రెండో సారి కూడా ఆయనను సస్పెండ్ చేయడంతో దాన్ని సవాల్ చేస్తూ ఏబీ వెంకటేశ్వరరావు క్యాట్‌లో పిటిషన్ వేశారు. ఏబీవీ తరపున సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం దాఖలు చేసిన వ్రాతపూర్వక వాదనల్లో వాస్తవిక తప్పులు ఉన్నాయని పేర్కొన్నారు. ఏబీవీపై విధించిన సస్పెన్షన్ చెల్లదని, ఇది ఇకపై కొనసాగదని నొక్కి చెప్పారు. సుప్రీంకోర్టు ద్వారా ఏబీవీ తిరిగి నియమించబడిన తర్వాత కూడా.. అవే ఆరోపణలతో రెండోసారి సస్పెండ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.

## ఐదేళ్ల అరాచక ప్రభుత్వానికి చరమగీతం

**ఇదే తన సంకల్పం అన్న పవన్ కళ్యాణ్**

**ఎన్‌డిఏ కూటమి గెలవబోతోందని వ్యాఖ్య**

**పిఠాపురం,ఏప్రిల్ 23(వెలుతురు):** ఐదేళ్ల అరాచక ప్రభుత్వానికి చరమగీతం పడేలా నామినేషన్ వేశానని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు ఆశీర్వాదించారని.. ఎన్నికల్లో గెలుపు ఖాయం అన్నారు. పవన్ కళ్యాణ్ మంగళవారం నాడు పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడిన పవన్.. ప్రజలకు ప్రత్యేక నమస్కారాలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో 2047 తరానికి చాలా కీలకం అని పేర్కొన్నారు. ఏపీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే జనసేన తగ్గిందని.. బలమైన నేతల త్యాగాలు సైతం తప్పలేదన్నారు. 30 చోట్ల తమ అభ్యర్థులను విత్‌డ్రా చేయమని చెప్పినట్లు పవన్ తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వర్మ తన సీటును త్యాగం చేశారన్నారు. వర్మకు రానున్న కాలంలో మంచి స్థానం వచ్చేలా ప్రయత్నిస్తానని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలవబోతోందని పవన్ ధీమా వ్యక్తం చేశారు. తిమ్మిని బమ్మిని చేసైనా తిరిగి అధికారాన్ని దక్కించుకోవాలని సీఎం జగన్ అండ్ కో కలలు కంటోంది. గడిచిన ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు కానీ మరో ఛాన్స్ ఇవ్వాలని ఏపీ ఓటర్లను ప్రాధేయపడుతోంది. ఆ పార్టీ ర్యాలీలు, సభలకు రాని జనాలు వచ్చినట్టు సొంత మీడియా, సోషల్ మీడియాలో చూపించుకుంటూ ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. అంతేనా టీడీపీ అధినేత చంద్రబాబును కుప్పంలో, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌ను పిఠాపురంలో ఓడిస్తామంటూ ఆ పార్టీ నాయకులు మేకపోతు గాంభీర్యంతో సవాళ్ల మీద సవాళ్లు విసురుతున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో వాస్తవిక పరిస్థితులు ఏమిటో.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి జనాల్లో ఎలాంటి ఆదరణ లభిస్తుందో వైసీపీ బ్యాచ్‌కు అర్థమయ్యే రీతిలో జనసేనాని పవన్ కళ్యాణ్ నామినేషన్ వేశారు. జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ అదిరిపోయే రేంజ్‌లో పిఠాపురం నుంచి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏ రేంజ్‌లో అంటే వైసీపీ శ్రేణులు ఉలిక్కిపడే రీతిలో నామినేషన్ వేశారు. భారీ బహిరంగ సభను తలపించేలా జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో వచ్చిన కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులతో రోడ్లు నిండిపోయాయి. మార్గం మొత్తం స్తంభించిపోయింది. ఆ స్థాయిలో జనాలు తరలిరావడంతో పిఠాపురంలో సీన్ ఏవిధంగా ఉందో అధికార పార్టీకి అర్థమయ్యేలా పవన్ చేశారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పవన్‌ను ఓడించడమే లక్ష్యంగా సీఎం జగన్ ప్రత్యేకంగా దృష్టి సారించారని, మంది మార్బలాన్ని అక్కడ రంగంలోకి దించాలని చాలా కథనాలు వెలువడ్డాయి. అయితే జగన్ పప్పులేవీ అక్కడ ఉడకబోవని నామినేషన్ ద్వారా పవన్ చాటి చెప్పారనే చర్చలు మొదలయ్యాయి. నామినేషన్‌కు ఈ రేంజ్‌లో జనాలు రావడంతోనే ఇక్కడ ఫలితం ఏంటో తెలిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు.



## పిఠాపురం ఎంఎల్‌ఏగా పవన్ కళ్యాణ్ నామినేషన్ దాఖలు

**పవన్ కళ్యాణ్ సంపాదన రూ.114.76,78,300**

**కట్టిన ఆదాయపు పన్ను రూ. 470732875**

**జిఎస్టీ రూ. 268470000 చెల్లింపు**

**అప్పులు రూ. 642684453 అఫిడవిట్‌లో వెల్లడి**

**కాకినాడ,ఏప్రిల్23(వెలుతురు):** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్.. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పవన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నటుడు నాగబాబు, పిఠాపురం టీడీపీ ఇంచార్జి వర్మ పాల్గొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలులోని నివాసం నుంచి పవన్ భారీ ర్యాలీగా బయల్దేరారు. ఈ ర్యాలీ చేబ్రోలు నుంచి పిఠాపురంలోని పాదగయ క్షేత్రం వరకు కొనసాగింది. జనసేన కార్యకర్తలు, ఆయన అభిమానులు ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పవన్ జాతీయ జెండా పట్టుకుని ప్రజలకు అభివాదం చేస్తుండగా ర్యాలీ ముందుకు సాగింది.ఈ సందర్భంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ లో గత అయిదు ఆర్థిక సంవత్సరాల ఆదాయం, అప్పులు, చెల్లించిన పన్నుల వివరాలు జనసేనాని తెలిపారు. గత 5 ఏళ్లలో పవన్ కళ్యాణ్ సంపాదన రూ.114.76,78,300 (నూట పద్నాలుగు కోట్ల 76 లక్షల 78



వేల 3 వందల రూపాయలు)గా ఉంది. తన సంపాదనకు సంబంధించి ఆదాయ పన్నుగా రూ.47,07,32,875 (47 కోట్ల 7 లక్షల 32 వేల 8 వందల డెబ్బై ఐదు రూపాయలు), జీఎస్టీ రూపంలో మరో రూ.28,84,70,000 (28 కోట్ల 84 లక్షల 70 వేల రూపాయలు) పవన్ కళ్యాణ్ చెల్లించారు. ఎన్నికల అఫిడవిట్ లో పవన్ కళ్యాణ్ తన అప్పుల గురించి వెల్లడించారు. పవన్ కళ్యాణ్ కు ఓవరాల్ గా అప్పులు రూ.64,26,84,453 (64 కోట్ల 26 లక్షల 84 వేల 4 వందల 53 రూపాయలు) ఉన్నాయి. ఇందులో వివిధ బ్యాంకుల నుంచి రూ.17,56,84,453 (17 కోట్ల 56 లక్షల 84 వేల 4 వందల యాభై మూడు రూపాయలు) అప్పుగా తీసుకున్నారు. వ్యక్తుల నుంచి పవన్ కళ్యాణ్ తీసుకున్న అప్పులు రూ.46,70,000 (46 లక్షల 70 వేల రూపాయలు) ఉన్నాయి. పవన్ కళ్యాణ్ వివిధ సంస్థలకు, జనసేన పార్టీ చేపట్టే సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల నిమిత్తం విరాళాలు అందించారు. ఇందులో జనసేనకు రూ.17,15,00,000 ఉన్నాయి. పార్టీ చేపట్టిన కౌలు రైతు భరోసా, క్రియాశీలక కార్యకర్తలకి ప్రమాద బీమా లాంటి కార్యక్రమాలకు ఉపయోగపడేలా వేర్వేరు సందర్భాలలో విరాళాలు ఇచ్చారు. వివిధ సంస్థలకు రూ.3,32,11,717 (రూ.3 కోట్ల 32 లక్షలు) విరాళాలు అందచేశారు.

## ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాం రెడ్డి..!

**రఘురాం రెడ్డి నామినేషన్ దాఖలు**

**అధికారికంగా ప్రకటించకపోవడంతో సర్వత్రా చర్చ**

**ఖమ్మం,ఏప్రిల్23(వెలుతురు):** ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాం రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రఘురాం రెడ్డి నామినేషన్ పత్రాలను అందజేశారు. అయితే ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిని ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించ లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ రఘురాం రెడ్డి ఆ పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. నామినేషన్ దాఖలు చేసిన రఘురాం రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వియ్యంకుడు. అయితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చెక్ పెట్టేందుకు మంత్రి పొంగులేటి మైండ్ గేమ్ పాలిటిక్స్ చేస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. తన భార్య నందిని కాకుంటే రాయల నాగేశ్వరరావుకు టికెట్



ఇవ్వాలని భట్టి డిమాండ్ చేసినట్లు సమాచారం. తన తమ్ముడు పొంగులేటి ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇవ్వకుంటే రఘురాం రెడ్డికి ఇవ్వాలని మంత్రి పొంగులేటి కాంగ్రెస్ చీఫ్ వద్ద డిమాండ్ చేసినట్లు సమాచారం.ఈ ఒక్క సీటుతో మంత్రి పొంగులేటి సీఎం రేవంత్‌రెడ్డికి చెక్ పెట్టారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సీటు విషయంలో మొదటి నుంచి ఎంతో పట్టుదలతో ఉన్న పొంగులేటి చివరికి తన పంతం నెగ్గించుకున్నారనే చర్చ జరుగుతోంది. పొంగులేటి కుటుంబసభ్యులకు టికెట్ రాకుండా అడ్డుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంతగానో ప్రయత్నించినట్టు పార్టీ అంతర్గత వర్గాల సమాచారం. అయినప్పటికీ వాళ్లందరి అభిప్రాయాన్ని కాదని అధిష్ఠానం పొంగులేటి వియ్యంకుడికి టికెట్ ఇవ్వడం రాష్ట్ర పార్టీలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకఛత్రాధిపత్యానికి చెక్ పెట్టడమేనని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామం సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్‌కు ఓ హెచ్చరిక లాంటిదనే చర్చ జోరుగా జరుగుతున్నది.

## జగన్ పాలనలో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రం

**చుక్కల భూముల్లో భారీగా అక్రమాలు**

**శ్రీకాకుళం కార్మికులకు ప్రత్యేక ఉపాధి**

**పాతపట్నం ప్రజాగళం సభలో చంద్రబాబు**

**జడ్జి ముందు ప్రమాణం చేసిన బాబు**

**శ్రీకాకుళం,ఏప్రిల్ 23(వెలుతురు):** తండ్రి ఆస్తి మొత్తం కొట్టేసి చెల్లికి వాటా ఇవ్వకుండా.. అప్పు ఇచ్చిన దుర్మార్గుడు జగన్ అని టిడిపి అధినేత చంద్రబాబు విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రం, ప్రజలు నష్టపోయారన్నారు. రైతుల పొలాల్లో సర్వే రాళ్లపైనా జగన్ తన ఫొటో వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. చుక్కల భూముల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి భూములు కొల్లగొట్టేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడ చూసినా శ్రీకాకుళం కార్మికులే ఉంటారు. మేం అధికారంలోకి వచ్చాక స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తాం. వ్యవసాయంలో ఆధునిక సాగు విధానాలు తెచ్చి.. రైతులకు ఖర్చులు తగ్గిస్తాం అని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో మీరు ఊహించని అభివృద్ధి చేసి చూపిస్తాం. పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు ఇస్తాం. డ్వాక్రా సంఘాలకు రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తాం. మేం వచ్చాక ఇంటి పన్నులు నియంత్రణ చేస్తాం. పాతపట్నం ప్రజలు కొత్త చరిత్ర రాసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో క్వీన్ స్వీప్ చేస్తున్నాం అని చంద్రబాబు అన్నారు.



ప్రచార సభలో ఎంపి రామ్మోమన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జడ్జి ముందు ప్రమాణం చేశారు. విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబు.. నగరంలోని గజపతినగరం సివిల్ జడ్జి కోర్టులో ఎన్నికల నామినేషన్ అఫిడవిట్ దాఖలు చేశారు. అనంతరం జడ్జి ఎదుట అఫిడవిట్‌తో చంద్రబాబు ప్రమాణం చేశారు. ఎందుకు ప్రమాణం చేయాల్సి వచ్చిందంటే.. కుప్పం టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 19న ఈ నానిమేషన్లు దాఖలు చేయడం జరిగింది. అయితే.. ఒకరి తరపున మరొకరు నామినేషన్లు దాఖలు చేస్తే.. ఇలా జడ్జికి నామినేషన్ పత్రాలు సమర్పించి.. ప్రమాణం చేయాల్సి ఉంటుంది.. అందుకే భువనేశ్వరి నామినేషన్లు దాఖలు చేయగా.. చంద్రబాబు ఇప్పుడు ప్రమాణం చేశారు. ఇదిలా ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల పర్వం ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే వందల సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. మరికొన్ని స్థానాల్లో మార్పులు, చేర్పులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే.. చంద్రబాబు విజయనగరం పర్యటనకు రావడంతో రసవత్తరంగా రాజకీయం మారింది. తమకు టిక్కెట్లు రాలేదని అలకబూని, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కెఏ నాయుడుతో బాబు చర్చించారు. సుమారు అరగంటపాటు అసంతృప్తులతో జరిగిన ఈ చర్చలు ఫలించాయి. అనంతరం బొండపల్లిలో మహిళా సదస్సుకు కిమిడి, నాయుడు ఇద్దరూ హాజరయ్యారు.

## భారత్ ఏదో ఒక వర్గానికి చెందినది కాదు

**మతం, భాష, దుస్తుల కోడ్‌లో ఏకరూపత సాధ్యం కాదు**

**జెఎన్‌యు విసి శాంతిశ్రీ పండిట్**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (వెలుతురు):** మతం, భాష, దుస్తుల కోడ్‌లో ఏకరూపత భారత్‌లో సాధ్యం కాదు అని, దేశం ఏదో ఒక వర్గానికి చెందినది కాకపోవడమే ఇందుకు కారణం అని జెఎన్‌యు వైస్ చాన్సలర్ శాంతిశ్రీ పండిట్ అన్నారు. ఢిల్లీలో పిటిఐ వార్తా సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఎడిటర్లతో పండిట్ ముఖాముఖి సాగిస్తూ, విద్యా సంస్థలు వ్యక్తిగత నిర్ణయాలను మన్నించాలని, హిజాబ్‌ను ధరించాలనుకునేవారిని అలా చేయనివ్వాలని సూచించారు. 'మతంలో గాని, జాతిలో గాని, భాషలో గాని ఏకరూపతను అంగీకరించను. ఏదో ఒక భాషను అందరిపై రుద్దరాదు. కొన్ని రాష్ట్రాల్లో కొందరు దానిని (అధికార భాషను) హిందీకి మార్చాలని కోరుకుంటే వారు చేయవచ్చు. అయితే, దక్షిణాదిలో అది కష్టం తూర్పు భారతదేశంలోనూ, తుదకు మహారాష్ట్రలోనూ హిందీని అంగీకరిస్తారని అనుకోను' అని ఆమె చెప్పారు. 'హిందీ ఉండవచ్చు కానీ ఒక్క భాషను అందరిపై రుద్దరాదని అంటాను. (జవహర్‌లాల్) నెహ్రూ, ఇందిరా గాంధీ ఇద్దరూ త్రిభాషా సూత్రం గురించి మాట్లాడేంత మూర్?లు కారు. ఎందుకంటే భారత్లో ఏకరూపత ఏవిధంగాను పని చేయదు' అని పండిట్ అన్నారు. జాతీయ భాషగా, బోధన, నేర్చుకోవడంలో ప్రధాన బోధన మీడియాల్లో ఒకటిగా హిందీ కోసం పట్టుబట్టడంపై ప్రశ్నకు విసి ఆ విధంగా సమాధానం ఇచ్చారు. 'భాష సున్నితమైన అంశం. ఆ విషయంలో ఎవరైనా జాగ్రత్తగా వ్యవహరించాలి. మీరు నన్ను అడిగినట్లయితే, ఒక్క భాషే ఉండాలనడంలో మీరు నింపాదిగా వ్యవహరించాలని అంటాను' అని ఆమె చెప్పారు. ఒకే ఉనికి, మతం దేశంలో పనిచేయవని కూడా పండిట్ అన్నారు. విద్యా సంస్థల్లో దుస్తుల నియమావళి గురించి మీ అభిప్రాయాలు ఏమిటన్న ప్రశ్నకు పండిట్ సమాధానం ఇస్తూ, అది వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com